TGTEL/25/A4111

# మంచితనం

దినపత్రిక

జర్నలిస్ట్

MANCHITANAM JOURNALIST DAILY




www.manchithanam.in

శనివారం, డిసెంబర్ 06 2025, సంపుటి : 02 సంచిక : 141 - పేజీలు - 8 వెల : 5 రూ/..

# మీరు ఆశీర్వదిస్తే ఢిల్లీని ఢీకొడతా



**వరంగల్, డిసెంబరు5 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే ఢిల్లీని ఢీకొడతానని హెచ్చరించారు. తనకు వయసుంది, ఓపికుందని కేంద్రాన్ని నిలదీస్తానని వార్నింగ్ ఇచ్చారు. (శుక్రవారం) నర్సంపేటలో సీఎం పర్యటించారు. రూ.508 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మళ్లీ అబద్దాలు చెబుతున్నారు. 'జూబ్లీహిల్స్ ఎన్నిక రెఫరెండం అన్నోళ్లు ఇంట్లో పండుకోక మళ్లీ అబద్దాలు చెబుతూ తిరుగుతున్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టారు. అభివృద్ధి జరగాలంటే మంచి సర్పంచ్‌ను ఎన్నుకోండి. క్వార్టర్‌కో, హాఫ్‌కో, ఫుల్లుకో ఓటు వేయొద్దు. ఎన్నికల్లో పైసలు ఖర్చు చేయొద్దు, ప్రజల మనసుతో గెలవాలి. గ్రామాల్లో ఉండే యువకులు సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేయండి. గ్రామాల్లో సర్పంచులు మంచోళ్లను గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమవుతుంది. వరంగల్ ఎయిర్‌పోర్ట్ కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎనాడైనా ఆలోలించారా తెలంగాణలో హైదరాబాద్ మినహా ఎక్కడా ఎయిర్‌పోర్ట్ నిర్మించాలన్నా ఆలోచన కేసీఆర్ హయాంలో రాలేదు. మార్చి 31లోపు వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. 'హైదరాబాద్ స్థాయిలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. రేషన్ ఇవ్వాలంటే గజ్వేల్‌లో ఫామ్ హౌజ్ రాసిచ్చినట్లుగా కేసీఆర్ ఫీలయ్యారు. కోటి పది లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. మూడు కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం. ఏపీ కంటే అధికంగా వడ్లు పండించిన రాష్ట్రం తెలంగాణ. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదన్నారు కానీ రైతులకు 24గంటల విద్యుత్ ఇస్తున్నాం. వరి వేస్తే ఉరే అని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో వరి పండించాలని చెప్పాం. ప్రపంచానికే పౌరుషాన్ని చాటిన వీరవనితలు సమ్మక్క-సారలమ్మ. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ విజయోత్సవాలు జరుపుకుంటున్నాం. ఏ ఊళ్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో అక్కడే బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడగాలి... మేము ఇందిరమ్మ ఇళ్ల ఇచ్చిన దగ్గర ఓట్లు అడుగుతాం. వచ్చే ఏడాదిలో నర్సంపేట నియోజకవర్గానికి 3000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. తరతరాలుగా కుల వృత్తుల బతుకులు మార్చలేదు... చదువొక్కటే పిల్లల భవిష్యత్తు మార్చుతుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌కు మా ప్రాధాన్యం. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తాం. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా మార్చుతాం. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరలు అందిస్తున్నాం. కోటిమంది ఆడబిడ్డలకు చీర, సారె అందజేస్తాం. ఇందిరమ్మ చీరలకు ఎంత ఖర్చయినా భరిస్తాం. త్వరలో మహిళల ఉత్పత్తులు ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు. పేదల తలరాతను మార్చేది చదువు ఒక్కటే. పేద బిడ్డలకు నాణ్యమైన చదువు అందించే బాధ్యత మాది. త్వరలోనే 40 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు. నిరుద్యోగులు బాగా చదవండి.. ఉద్యోగాలు సాధించండి. గ్రామాల్లో రాజకీయ కక్షలకు యువత బలికావొద్దు. గ్రామాల్లో రూ.20 వేలకోట్లతో రోడ్లు వేస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లపై కీలక నిర్ణయం



**హైదరాబాద్, డిసెంబరు5 :** రాష్ట్రంలో మూడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలో లక్ష ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చికి మూడు లక్షల ఇళ్లు గృహప్రవేశం పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పుకొచ్చారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రణాళికలు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా ప్రణాళిక సిద్ధమైందని వివరించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మించి పేదలకు ఇచ్చే ప్రణాళికలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో అర్బన్ ప్రణాళిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఆనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో చోట 10వేల ఇళ్లు నిర్మించి నో ప్రాఫిట్ నో లాస్ కింద మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రణాళికలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖను తిరిగి తాము బలోపేతం చేశామని వివరించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ పథకం వర్తింపజేయడంపై ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు. రూరల్‌లో, అర్బన్‌లో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు కూడా త్వరలో శుభవార్త చెబుతామని పేర్కొన్నారు. ఒక విడతలోనే ఇళ్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని చెప్పుకొచ్చారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. హిల్ట్‌పాలసీపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. కేటీఆర్ హిల్ట్ పాలసీపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని అంటున్నారని... నోటికొచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని.. వారి హయాంలో ఇష్టం వచ్చినట్లుగా చేశారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం చాలా వినూత్న నిర్ణయాలు తీసుకుంటుందని.. కేసీఆర్ హయాంలో లాగా తాము చేయమని స్పష్టం చేశారు.

# మేము తటస్థం కాదు శాంతి పక్షాన నిలిచాము



**ఢిల్లీ:** ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. భారత ప్రధాని మోదీతో నేడు సమావేశమయ్యారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీతో కలిసి రష్యా అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ ఉక్రెయిన్-రష్యాల మధ్య శాంతిస్థాపన కోసం ప్రధాని మోదీ చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. ఇందుకు ప్రధాని మోదీ బదులిస్తూ భారత్‌ది తటస్థ వైఖరి కాదని, తాము శాంతిసౌభాగ్యాల పక్షాన ఉంటామని తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభం మొదలైన నాటి నుంచి పుతిన్ అసలైన స్నేహితుడిలా అక్కడి విషయాలను ఎప్పటికప్పుడు తనతో పంచుకున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ నమ్మకమే అసలైన బలమని వ్యాఖ్యానించారు. శాంతిస్థాపనతోనే దేశాలు పురోగమిస్తాయని తెలిపారు. భారత్ రష్యాలు కలిసికట్టుగా ప్రపంచాన్ని శాంతిమార్గంలో నడిపిస్తాయని అన్నారు. ఇప్పటివరకూ చేసిన ప్రయత్నాలతో ప్రపంచం మళ్లీ శాంతివైపు మళ్లుతుందన్న నమ్మకం తనకు ఉందని అన్నారు. భారత్-రష్యా దౌత్యబంధం వెనుకున్న దార్శనికత కూడా గొప్పదని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇరుదేశాల మధ్య మార్కెట్లకు ద్వారాలు తెరవటం, వాణిజ్యం పెంచేందుకు వీలుగా త్వరగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయటంపై చర్చించారు. ఇరుదేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ఇరుదేశాలు పలు కీలక ఒప్పందాలు చేసుకున్నాయి. వలసలు, మొబిలిటీ, వైద్యం, ఆహార భద్రత, ఓడరేవులు, షిప్పింగ్ రంగంలో సహకారంపై ఒప్పందం చేసుకున్నాయి. ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ సమక్షంలో ఇరుదేశాలకు చెందిన ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. అనంతరం ఇరువురు కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. భారత్-రష్యా మధ్య మైత్రి ఎనిమిది దశాబ్దాలకుపైగా ధృవనక్షత్రంలా స్థిరంగా ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, నమ్మకంతో ఎల్లప్పుడూ కాలపరీక్షకు నిలిచాయన్నారు. భారత్-రష్యా బిజినెస్ ఫోరంలో భారత్ యాక్టివ్‌గా పాల్గొంటుందని చెప్పారు. ఈ వేదిక ఇరుదేశాల పరిశ్రమల్లో సహ-ఉత్పత్తి, సహ-నూతన కార్యక్రమాలను బలోపేతం చేస్తుందని ప్రధాని చెప్పారు. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను ప్రపంచం అధిగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, రష్యాలు కలిసికట్టుగా మరిన్ని ఉన్నత శిఖరాలు చేరుకునే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. ఇక ఈ సమావేశంలో ఇరు దేశాలు పలు ఒప్పందాలు కూడా కుదుర్చుకోనున్నాయి.

# తెలంగాణాపై చలి పంజా

**హైదరాబాద్:** తెలంగాణలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతూ చలి తీవ్రత పెరుగుతోంది. దిత్వా తుఫాన్ ప్రభావమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. రానున్న నాలుగు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడటం వల్ల.. శుక్ర, శనివారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అలాగే ఈ నెల 9న మరోసారి వర్ష సూచన కనిపిస్తోందని పేర్కొంది. దీంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రత స్థాయిలు మరింత క్షీణించనున్నాయి. దిత్వా తుఫాను తర్వాత రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పగటి వేళ ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుండగా, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే తక్కువగా నమోదవుతున్నాయి. ఉదయం పూట విపరీతంగా మంచు కురుస్తోంది. ఇక రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుగ్గా వీస్తుండటంతో ఇప్పటికే ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోగా.. చలి విపరీతంగా పెరిగింది. శుక్రవారం నుంచి గాలిలో తేమశాతం తగ్గడం వల్ల.. చలి గాలులు మరింత తీవ్రతరం కానున్నాయి.

# స్టూడెంట్ ఇన్నోవేషన్ సమ్మిట్ ద్వారా నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం



**పార్వతీపురం మన్యం జిల్లా, డిసెంబరు5 :** చదువులో వెనుకబడిన పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చదివారని. రాష్ట్రంలోని విద్యార్థులను కూడా అదే స్థాయికి తీసుకెళ్లాలని సూచిం చారు. లోకేశ్ కోసం తాను ఎప్పుడూ స్కూలుకు వెళ్లలేదని చెప్పుకొచ్చారు. ఏపీ విద్యశాఖలో నూతన ఒరవడి సృష్టిస్తానని లోకేశ్ అన్నారని.. ఈ విషయంలో తాను ఆశీర్వదించానని పేర్కొన్నారు. ఏపీ వ్యాప్తంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్‌ను నిర్వహించారు. మన్యం జిల్లా బామినిలో పాల్గొని ప్రసంగించారు సీఎం చంద్రబాబు. తమ ప్రభుత్వంలో అత్యాధునిక విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆ దిశగా ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి విదేశాల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఉపాధ్యాయులను గౌరవించటంతో పాటు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని వ్యాఖ్యానించారు సీఎం చంద్రబాబు. జగన్ హయాంలో విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని.. ఆ పరిస్థితిని తమ ప్రభుత్వంలో చక్కదిద్దామని పేర్కొన్నారు. కేంద్రంలో వికసిత్ భారత్ తీసుకువస్తే రాష్ట్రంలో స్వర్ణాంధ్రా నినాదంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో పిల్లలు, ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి, ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుతారని తాను ఆశిస్తున్నానని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో వినూత్నమైన మార్పులు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ముస్తాబు కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తీసుకువచ్చారని కొనియాడారు. ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం వినూత్నమైన ఆలోచనలతో ముందుకెళ్తున్నారని.. నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నారని ప్రశంసించారు. ఈ ఏడాది జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేషన్ సమ్మిట్ నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ మోసానికి నిండు ప్రాణం బలైంది



**హైదరాబాద్:** బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి శ్రీసాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు. పంచా?ఖయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్ కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిఆమండ్ చేశారు.

# ఇండిగో సంక్షోభంపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు కేంద్రం సూచన



**న్యూఢిల్లీ:** ఇండిగో ఫ్లైట్ సర్వీసులు పెద్దఎత్తున రద్దవుతుండటంతో తలెత్తిన సంక్షోభంపై కేంద్రం చర్యలకు దిగింది. ఇండిగో సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర?యించినట్టు తెలిపింది. సంక్షోభానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గత నాలుగైదు రోజులుగా ఇండిగో విమాన సర్వీసుల సామూహిక రద్దుతో తలెత్తిన సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ప్రభుత్వం నిరయించినట్టు కేంద్ర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇండిగో సర్వీసుల్లో ఎక్కడ పొరపాటు జరిగింది, ఇందుకు బాధ్యులెవరనేది దర్యాప్తులో గుర్తించి, అవరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. భవిష్యత్తుల్లో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుం డా, ప్రయాణికులకు కష్టం కలకుండా చూస్తామని వివరించింది. ప్రయాణికుల భద్రత విషయం లో ఎలాంటి రాజీ లేదని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, పేషెంట్లు, ఇతరులు అర్జెంట్ అవసరాల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంటుందని పేర్కొంది. ఫ్లైట్ సర్వీసులు శనివారం నుంచి తిరిగి ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నామని, మూడు రోజుల్లోగా పూర్తిగా పునరుద్ధిస్తామని తెలిపింది.

# హిల్ట్ పాలసీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు



**హైదరాబాద్, డిసెంబరు 5 :** హిల్ట్ పాలసీపై తెలంగాణ హైకోర్టులో (శుక్రవారం) విచారణ జరిగింది. హిల్ట్ పాలసీపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్లు దాఖలు చేశారు. 9,292 ఎకరాల భూ కేటాయింపుల విషయంలో రూపొందించిన జీఓ నిబంధనలకు విరుద్ధంగా ఉందని హైకోర్టుకు ఆయన తెలిపారు. దీనిపై సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు చేయించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఉన్న రికార్డులను సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోర్టుకు విన్నవించారు. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. వెంటనే రిప్లై ఫైల్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 29వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు.

# జోయాలుక్కాస్ 'బ్రిల్లియన్స్' డైమండ్ ప్రదర్శన ప్రారంభం





**మంచితనం జర్నలిస్ట్: డా ఏఎస్ రావునగర్ డిసెంబర్ 5(మంచితనం న్యూస్)** కాప్రా మున్సిపల్ పరిధిలోని డా:ఎ.ఎస్.రావు నగర్ లో జోయాలుక్కాస్‌లో బ్రిల్లియన్స్ డైమండ్ జ్యువెలరీ షో డిసెంబర్ 5 నుంచి 21 వరకు అంగరంగ వైభవంగా జరుగుతోంది. విలాసవంతమైన వివాహ సెట్ల నుంచి ట్రెండీ డైలీ వేర్ వరకు విభిన్నమైన వజ్రాభరణాలను ఈ స్పెషల్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. ప్రతి డిజైన్ ప్రత్యేకమైనది, ప్రదర్శన కాలంలో మాత్రమే అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది.జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జోయాలుక్కాస్ మాట్లాడుతూ%౹౯% "వజ్రాల శాశ్వత అందాన్ని, డిజైన్‌లోని నైపుణ్యాన్ని జరుపుకునే వేడుక ఇది. ఎ.ఎస్.రావు నగర్ మా ప్రయాణంలో ప్రత్యేక స్థానం కలిగిన ప్రదేశం" అని తెలిపారు.ప్రదర్శన సందర్భంగా రూ.1 లక్షకు పైగా వజ్రాభరణాలు కొనుగోలు చేసే ప్రతి కస్టమర్‌కు ఉచిత బంగారు నాణెం అందజేస్తామని సంస్థ వెల్లడించింది.ఈ ప్రత్యేక డైమండ్ షో డిసెంబర్ 21 వరకు జోయాలుక్కాస్ ఎ.ఎస్.రావు నగర్ షోరూమ్‌లో కొనసాగుతుంది. వజ్రాల కళ, అందం, నైపుణ్యం ఒకే చోట అనుభవించే అవకాశం ఇదే.కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సునీల్ పీఎస్ , రీజనల్ మార్కెట్ మేనేజర్ కె శ్రీనివాస్, జోయాలుక్కాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మల్కిజ్ గూడ గ్రామ పంచాయతి సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన గౌరారం వెంకట్ రెడ్డి



**మంచితనం జర్నలిస్ట్:** మల్కిజ్ గూడ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రోజు న సర్పంచ్ అభ్యర్థి గౌరారం వెంకట్ రెడ్డి నామినేషన్ కి విజయోత్సంగా ర్యాలీగా తరలి గ్రామ ప్రజలంతా గెలుపుకై అందరి సమక్షంలో నామినేషన్ కి బయలు దేరారు. గ్రామ పెద్దలు. నాయకులు. యువకులు అందరూ దీవెనలు పొందిన నాయకుడు గౌరారం వెంకట్ రెడ్డి తమ పార్టీల నాయకులతో కలిసి యాచారం రిటర్నింగ్ అధికారి ముందు నామినేషన్లు దాఖలు చేశారు.ఈ యొక్క కార్యక్రమం లో గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం గా నామినేషన్ లు దాఖలు చేశారు

# విద్యార్థులు చదువుతోపాటు ఆటలోనూ రాణించాలి

- క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి
- ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- కేంద్రీయ విద్యాలయం వార్షిక ఆటల పోటీలు ప్రారంభం
- అలరించిన విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు







**తంగళ్ళపల్లి 05,:-**
విద్యార్థులు చదువుతోపాటు ఆటలోనూ రాణించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయం వార్షిక ఆటల పోటీలు 2025- 26 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరు కాగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్వాగతం పలికారు. ఆటల పోటీల జెండాను ఆవిష్కరించి, ప్రారంభించారు. విద్యార్థుల న ృత్యాలు, ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలని పిలుపు ఇచ్చారు. విద్యార్థులు ఆన్లైన్ గేమ్స్ ఆడవద్దని, ప్రతి రోజు గంట పాటు ఆటలు ఆడాలని సూచించారు. క్రీడలు, యోగా సాధనతో శారీరక, మానసిక సమతుల్యత, అభివ ృద్ధి సాధ్యమని వివరించారు. తరగతి గది పుస్తకాలతోపాటు లైబ్రరీ లోని ఇష్టమైన పుస్తకాలు, దిన పత్రికలు చదవాలని పేర్కొన్నారు. వివిధ అంశాలపై అవగాహన వస్తుందని వివరించారు. గత ప్రశ్నాపత్రాలు, మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలని సూచించారు. దీంతో వార్షిక, పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులువు అవుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శేషా ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఈ సీ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
- ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ



**ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్ 05,:-**
రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ ఈ సీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, ముస్తాబాద్ లోని రైతు వేదికలో శుక్రవారం ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హాజరై ఎన్నికల నిర్వహణ, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎస్ ఈ సీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలు తనిఖీ చేయాలని, సంబంధిత ఎంపీడీఓలు, అధికారులతో ఆ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. అనంతరం లేవనెత్తిన సందేహాలను నివ ృత్తి చేశారు.

**– నామినేషన్ కేంద్రంలో పరిశీలన..**

ముస్తాబాద్ లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. హెల్ప్ డెస్క్, నామినేషన్లు పరిశీలించి, అధికారులతో మాట్లాడారు.
శిక్షణలో మండల ప్రత్యేక అధికారులు అఫ్జల్ బేగం, రాఘవేందర్, క్రాంతి, తహసీల్దార్లు సుజాత, రామచందర్, ఎంపీడీఓలు సత్తయ్య, లచ్చాలు, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాగును దొంగిలించిన దొంగ అరెస్ట్, రిమాండ్

- దొంగ వద్ద 3,92,500 స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి




**రాజన్న సిరిసిల్ల 05,:-**
-వేములవాడకు చెందిన నార్ల శ్రీనివాస్ హైదరాబాదులోని హెూల్సేల్ దుకాణాలకు చెల్లించాల్సిన 3,97,500/- రూ. నగదుతో పాటు తన ఆధార్ కార్డు, పాన్ కార్డు, హెల్త్ కార్డు, ప్రెస్ అక్రిడేషన్ కార్డు, బస్ పాస్, రెండు చెక్కులు ఉన్న పర్సును క్యాష్ బ్యాగ్‌లో ఉంచుకొని డిసెంబర్ 3న ఉదయం 11:40 గంటలకు వేములవాడ బస్టాండ్ వద్ద బస్సులో ఎక్కారు. లాస్ట్ సీట్ కింద బ్యాగ్ ఉంచి కూర్చున్న ఆయన కొద్దిసేపటికి ముందు సీటుకు మారి కూర్చొన్నారు. సుమారు 12:15 గంటలకు తంగళ్ళపల్లి వద్దకు చేరుకునే సరికి వెనుక సీటుకు వెళ్లి చూసినప్పుడు బ్యాగ్ కనిపించకపోవడంతో కండక్టర్‌ను విచారించగా, సిరిసిల్ల వద్ద ఒక వ్యక్తి బస్సు దిగినట్టు చెప్పాగా, శ్రీనివాస్ సిరిసిల్ల పట్టణ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకొని పోలీస్ సిబ్బంది వెంటనే రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి వేములవాడ నుండి సిరిసిల్ల వరకు ఉన్న అన్ని సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని వేములవాడ మండలం రుంద్రారం గ్రామానికి చెందిన బండారి బాలరాజుగా గుర్తించి ఈరోజు అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుడు తాను వేములవాడలోనే సిద్దిపేట్ బస్సులో ఎక్కి వెనుక సీటులో కూర్చున్నట్టు, పక్కనే బ్యాగ్‌ను సీట్ కింద పెట్టినట్టు గమనించి అవకాశం దొరికినప్పుడు బ్యాగ్‌లో ఉన్న డబ్బులను చూసి దొంగతనం చేయాలని భావించి, సిద్దిపేట్ టికెట్ తీసుకున్నప్పటికీ చంద్రంపేట్ వద్ద దిగానని ఒప్పుకున్నాడు. పోలీసులు నిందితుడి వద్ద నుండి మొత్తం నగదును రికవరీ చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగింది డీఎస్పీ తెలిపారు. బస్సులలో ప్రయాణించేటప్పుడు చుట్టూ ప్రక్కల ఉన్న వారిని గమనించి విలువైన వస్తువులు, నగలు, డబ్బులు ఉన్న బ్యాగులను వారి యొక్క చేతిలోనే పట్టుకొని జాగ్రత్తగా ఉండాలని, ఇతరులు ఏమైనా తును బండారాలు గాని వాటర్ గాని ఇస్తే తిసుకోకుడదని తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును చేధించిన పట్టణ ఇన్స్పెక్టర్ క ృష?, సిబ్బంది శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, రావికుమార్ లను డీఎస్పీ అభినందించారు.

# గ్రామాల్లో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం



**చందుర్తి 05,:-** చందుర్తి మండలం లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఒక్కసారిగా ఊపందుకుంది. మండలంలో 19 గ్రామాలకు గాను ఏ ఒక్క గ్రామపంచాయతీ కూడా ఏకగ్రీవం కాలేదు, మండల కేంద్రంతో పాటు, మేజర్ గ్రామమైన మల్యాలలో అభ్యర్థులు ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. కిష్టంపేట గ్రామంలో మాజీ సర్పంచ్ కొమ్ము రమేష్ గ్రామస్తులతో భారీ ర్యాలీ నిర్వహిస్తూ ప్రచారాన్ని ఉధ ృతం చేశారు. గతంలో మాజీ సర్పంచ్ గా గ్రామానికి చేసిన సేవలను ఓటర్లకు వివరిస్తూ ప్రచారంలో ముందుకు వెళుతున్నాడు. కిష్టంపేట మాజీ సర్పంచ్ బాణాల గంగారెడ్డి సహకారంతో కోమ్ము రమేష్ ప్రచారాన్ని ఉధ ృతం చేశాడు.

# రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో గట్టెపల్లి పాఠశాల విద్యార్థిని ప్రతిభ....



**సుల్తానాబాద్,డిసెంబర్ 05 :** రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో గట్టెపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. నవంబర్ 28 నుండి 30 తేదీలలో హైదరాబాద్ లోని మొయినాబాద్ ఫైర్ ఫ్యాక్స్ స్పోర్ట్స్, రీసార్ట్లో జరిగిన 12 వ తెలంగాణ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఇంటర్ డిస్టిక్ క్రీడల్లో పెద్దపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన సుల్తానాబాద్ మండలం లోని గట్టెపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థిని ఉమెన్స్ విభాగంలో 9 వ తరగతి మనహ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. విద్యార్థిని పాఠశాల హెచ్ఎం వి అన్నపూర?, ఫిజికల్ డైరెక్టర్ ప్రణయ్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులకు ఇన్స్పైర్ అవార్డ్స్




**పెద్దపల్లి ప్రతినిధి,డిసెంబర్ 5** ఎన్టీపీసీ జ్యోతినగర్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో డిసెంబర్ 2 నుండి 4 వరకు నిర్వహించిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025,ఇన్స్పైర్ అవార్డ్స్‌లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వాటర్ కన్సర్వేషన్ అండ్ మేనేజ్మెంట్ విభాగంలో జూనియర్ స్థాయిలో 6వ తరగతి విద్యార్థిని ఎన్. సాధ్వి జెసి ప్రథమ స్థానం, సీనియర్ స్థాయిలో 9వ తరగతి విద్యార్థిని కే. శ్రుతి ప్రియా ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారు.విద్యార్థుల విజయంపై గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, "విద్యతో పాటు వైజ్ఞానిక ఆవిష్కరణల్లోనూ మా విద్యార్థులు రాణించడం గర్వకారణం. రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్నాలజీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా నైపుణ్యాలు, పరిశోధనాత్మక విద్యను అందిస్తున్నాం" అని తెలిపారు.విజేతలకు అభినందనలు తెలుపుతూ ప్రశంసాపత్రాలు, అవార్డులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్లంకి రజనీదేవి, ప్రిన్సిపాల్ విజయ్, గైడ్ టీచర్ సదానందం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# 7న జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల,బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు



**పెద్దపల్లి,డిసెంబర్ 5** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఈ నెల 07వ తేదీ ఆదివారం జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు జరుగనున్నాయని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట ఉమాపతి, కార్యనిర్వహణ కార్యదర్శి భాషబోయిన వాసు, కోచ్ అనూష తెలిపారు.పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు మైదానానికి హాజరుకావాల్సిందిగా సూచించారు. ఈ పోటీలకు అర్హత కలిగిన వారు 01-01-2011 నుండి 31-12-2013 మధ్య జన్మించిన క్రీడాకారులై ఉండాలని నిర్వాహకులు తెలిపారు.ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

# హిడ్మాది హత్య కాదు, ఎన్‌కౌంటర్ దీనిపై విచారణ జరిపించాలి

**హైదరాబాద్:** కామ్రేడ్స్ హిడ్మా (మారేడుమిల్లి), కామ్రేడ్ శంకర్ (రంపాచోడవరం) హత్యలపై న్యాయ విచారణ జరిపించి, దోషులకు కఠిన శిక్షలు విధించేందుకు ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పేరుతో ఈ లేఖను విడుదల చేసింది. కామ్రేడ్ హిడ్మా హత్యకు కామ్రేడ్ దేవజీ కారణమని మనీష్ కుంజాం, సోనీ సోడి ద్వారా ఇచ్చిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం అంటూ లేఖలో పేర్కొన్నారు.కేంద్ర కమిటీ సభ్యులు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ హిడ్మాను, అతనితో పాటు మరో 5 మంది కామ్రేడ్లను ఆంధ్రప్రదేశ్ పోలీసులు నవంబరు 15న అరెస్టు చేశారు. ఆ తర్వాత మూడు రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆ లేఖలో మావోయిస్టు పార్టీ లేఖలో డిమాండ్ చేసింది.హిడ్మా ఎన్?కౌంటర్?పై విచారణ జరిపించాలని మావోయిస్టుల లేఖ అసలేం జరిగింది : "కామ్రేడ్ హిడ్మా అక్టోబరు 27న విజయవాడకు చెందిన ఒక కలప వ్యాపారితో చికిత్స కోసం విజయవాడకు వెళ్లారు. ఆ తర్వాత మరి కొంతమంది కామ్రేడ్లు వెళ్లారు. కామ్రేడ్ హిడ్మాతో సహా 6 మంది కామ్రేడ్లను పోలీసులు హత్య చేసి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి అడవుల్లో జరిగిన



ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు తప్పుడు కథను అల్లారు" అని మావోయిస్టులు లేఖలో ఆరోపించారు."ఈ మేరకు రెండు సంఘటనలలో మా కామ్రేడ్లను బయటకు తీసుకెళ్లిన వ్యక్తులను, ఈ మొత్తం హత్య వెనుక ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి అడవుల్లోని 50 మంది గిరిజనులకు సంబంధించిన వ్యాపారి, అదే జిల్లాలోని ఐటిడిఎకు చెందిన కారు డ్రైవరు, విజయవాడకు చెందిన ఒక కలప వ్యాపారి, విజయవాడకు చెందిన ఓ డాక్టర్? తదితరులందరినీ విచారించాలి. ఈ హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం." అని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ లేఖలో డిమాండ్ చేసింది.విచారణ జరపాలని డిమాండ్ : ఈ హత్యకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ఇంటెలిజెన్స్ ఏజెన్సీల హస్తం స్పష్టంగా తెలుస్తోందని మావోయిస్టులు తెలిపారు. కేంద్రం, రాష్ట్రాల ఇంటెలిజెన్స్ ఏజెన్సీల ఆదేశాల మేరకు ఈ కామ్రేడ్స్ హిడ్మా, శంకర్ మొత్తం 13 మంది కామ్రేడ్లను అరెస్టు చేసి ఈ నకిలీ ఎన్‌కౌంటర్లను స ృష్టించి హత్య చేశారని స్పష్టమవుతోందన్నారు. ఈ హత్యలకు కేంద్ర ప్రభుత్వంలోని పెద్ద అధికారులు బాధ్యులని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి విదేశీ కాపలాదారులు సహకరించారని లేఖలో పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై న్యాయ విచారణ జరగాలని కోరారు. ఎన్?కౌంటర్?లో చనిపోయిన మావోయిస్టులకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ నివాళులు అర్పించింది. వారి పోరాటం వ ృథా పోదని, వారి బాటలో నడుస్తామని లేఖలో స్పష్టం చేశారు. మరోవైపు ఈ లేఖను ఇంటెలిజెన్స్ వర్గాలు విశ్లేషిస్తున్నారు. లేఖ ఎప్పుడు విడుదలైంది, ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై నిఘా వర్గాలు సమాచారం సేకరిస్తున్నాయి.

# కారులో రూ.4 కోట్ల హవాలా నగదు - పక్కా సమాచారంతో సీజ్



**హైదరాబాద్ :** హైదరాబాదనగరంలోని శామీర్‌పేటలో భారీగా హవాలా నగదును బోయిన్‌పల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శామీర్ పేట పరిధిలో కారులో భారీగా హవాలా సొమ్ము తరలిస్తున్నారనే సమాచారంపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఓ కారులో టైర్లు, సీట్ల కింద రూ.4 కోట్ల హవాలా నగదును గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.ఈ సొమ్ము ఎక్కడిది? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. నిజామాబాద్? నుంచి నగదును హైదరాబాద్?కు తరలిస్తుండగా ఈ సొమ్మును పట్టుకున్నారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల కోడ్? అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నగదును తరలించే వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టారు.

# లక్ష కోట్ల ప్రభుత్వ ఆస్తులను రక్షించడమే ధ్యేయం

- సమాజంలో ఉన్న ట్యూమర్లను తొలగిస్తున్నాం..
- ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ ఆస్తులు రక్షిస్తున్నాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్:** శస్త్రచికిత్సలు చేసే వైద్యుల కంటే తాము ఏమాత్రం తక్కువ కాదని, వ్యాధులకు వైద్యులు చికిత్స చేస్తుంటే, సమాజంలో ఉన్న ట్యూమర్లను తాము తొలగిస్తున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్అన్నారు. ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ 12వ వార్షికోత్సవాన్ని గురువారం హోటల్ దసపల్లాలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ..15 నెలల కాలంలో 60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను, భూములను హైడ్రా రక్షించిందన్నారు. 2026లో లక్ష




కోట్ల ప్రభుత్వ ఆస్తులను రక్షించడమే ధ్యేయంగా పనిచేసా

మన్నారు. ప్రభుత్వ ఆస్తులను తిరిగి తెచ్చుకోవడం ఒక ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చినబాబు సుంకపల్లి మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి నుంచి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడానికి మేఘాలయ,త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాలతో అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. అనంతరం ఫౌండేషన్ స్పాన్సర్లు, సహాయకులకు రంగనాథ్ జ్ఞాపికలు అందజేశారు. వార్షిక జనరల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ శైలేంద్ర కుమార్ జోషి తదితరులు మాట్లాడారు.

# ఐబొమ్మ రవికి బిగ్ షాక్ మరోసారి కస్టడీకి కోర్టు అనుమతి




**హైదరాబాద్, డిసెంబరు5 :** ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కేసుపై నాంపల్లి కోర్టులో(శుక్రవారం) విచారణ జరిగింది. నిందితుడు రవిని మూడోసారి కస్టడీకి అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే మరో నాలుగు కేసుల్లో కస్టడీ కోరుతూ పోలీసులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. మూడు కేసుల్లో మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతించింది నాంపల్లి కోర్టు.ఒక్కో కేసుకు ఒక్కో రోజు కస్టడీ అనుమతి ఇచ్చింది న్యాయస్థానం. అయితే, నాలుగు కేసుల్లో ఒక కేసు కస్టడీ తిరస్కరణకు గురైంది. పోలీసుల వాదనలతో ఏకీభవించి ఐబొమ్మ రవిని కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఇప్పటికే రెండుసార్లు ఆయనను కస్టడీకి తీసుకొని విచారించారు సైబర్ క్రైమ్ పోలీసులు. మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇచ్చింది నాంపల్లి కోర్టు. ఈ క్రమంలోనే శనివారం, సోమవారం, మంగళవారం ఐబొమ్మ రవిని కస్టడీ విచారణ చేయనున్నారు పోలీసులు. ఈ నేపథ్యంలోనే రవి బెయిల్‌పై సోమవారం వాదనలను మరోసారి విననుంది నాంపల్లి కోర్టు.

# రసవత్తరంగా పల్లె రాజకీయం - సర్పంచ్ పీఠం కోసం అభ్యర్థుల నానా పాట్లు

**సిద్దిపేట జిల్లా :** పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. సర్పంచి ఎన్నికల కోసం కొన్ని గ్రామాల్లో సొంత వారి మధ్య భిన్నాభిప్రాయాలు వస్తుంటే మరికొటందరు నీకిది , నాకది అంటూ ఐక్యమత్యంగా నడుచుకుంటున్నారు. మరికొన్నిచోట్ల విదేశాల నుంచి వచ్చి మరీ గ్రామాభివృద్ధి తోడ్పడాలని కొందరు ప్రయత్నిస్తున్నారు.ఇద్దరి సిద్ధాంతాలు వేరంటూ ఓ చోట తండ్రిపైనే కుమారుడు పోటీ చేస్తున్నాడు. మరో చోట సర్పంచ్‌గా తల్లి, వార్డుసభ్యునిగా కుమారుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంకో గ్రామంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ సర్పంచ్ అభ్యర్థులు సహా 63 మందిపై కేసులు నమోదయ్యాయి.గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. ఓ వైపు మూడో విడతకు నామినేషన్లు మొదలయ్యాయి. మరో వైపు అనేక గ్రామాల్లో ఏకగ్రీవాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల వేళ అభ్యర్థుల తీరుతో స్థానిక పోరు చూపరులకు ఆసక్తికరంగా మారుతోంది. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థులుగా తండ్రి, కుమారుడు తలపడుతున్నారు. తండ్రి రామకిష్టయ్య సిద్ధాంతాలు, తన విధానాలు వేరంటు కుమారుడు వెంకటేశ్ పోటీకి సై




అంటున్నాడు. 1563 మంది ఓటర్లున్న గ్రామంలో మొత్తం పది మంది సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు.సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామ ప్రజలు ఆదర్శంగా నిలిచారు. ఏ విధమైన ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికను ఏకగ్రీవం చేసుకున్నారు. ఏకగ్రీవమే మేలనుకున్నారు. ఎలాంటి మనస్పరా?లకు చోటు ఇవ్వలేదు. అయితే ఇక్కడ ఆ గ్రామస్థులంతా తల్లిని సర్పంచ్‌ని చేశారు. కుమారుడిని వార్డు సభ్యుడిగా ఎన్నుకోవడం మరో విశేషంగా నిలిచింది.ఇద్దరు భార్యలతో నామినేషన్ : సిద్ధిపేట జిల్లా అక్బర్‌పేట - భూంపల్లి మండలం జంగపల్లిలిలో గ్రామస్థుల తీర్మానం మేరకు ఓ వ్యక్తి తన ఇద్దరు భార్యలతో నామినేషన్ వేయించారు. నవంబర్ 30న మొదటి భార్యతో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయించారు. పొరపాట్లుంటే తొలగిస్తారనే అనుమానంతో రెండో భార్యతోనూ నామపత్రాన్ని దాఖలు చేయించారు. గ్రామంలో నుంచి ఇతరులెవరూ పోటీకి దిగలేదు. ఈనెల 6న ఇద్దరు భార్యలలో ఒకరి నామినేషన్ ఉపసంహరించుకోనున్నారు. తద్వారా సర్పంచ్‌తో పాటు 10 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కానున్నారు.ఎన్నికల కోడ్?ను ఉల్లంఘిస్తే : సిద్ధిపేట జిల్లా అక్బర్-భూంపల్లి మండలం తాళ్లపల్లిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 63 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సర్పంచ్ పదవికి ఐదుగురు అభ్యర్థులు పోటీచేస్తున్నారు. అయితే ఆ గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న పెద్దమ్మ గుడి వద్ద కొందరు రహస్యంగా సమావేశమయ్యారు. గుడి నిర్మాణానికి ఎక్కువ డబ్బులిచ్చే అభ్యర్థికే కులస్థులంతా ఓటేయాలని చర్చలు జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కోడ్ అమలులో ఉండగా అనుమతి లేకుండా సమావేశం జరపడం సరికాదు. దానికితోడు ఓట్ల కోసం డబ్బులివ్వాలని డిమాండ్ చేయడం ఉల్లంఘనల కిందకు వస్తాయని పోలీసులు అన్నారు. దాంతో వారు ఐదుగురు సర్పంచ్ అభ్యర్థులు, ఇద్దరు కుల సంఘ నాయకులు సహా 56 మంది గ్రామస్థులపై కేసు నమోదు చేశారు.

# బీసీలంతా ఏకమై ఈ ప్రభుత్వాన్ని గద్దెదింపుతాం

**హైదరాబాద్:** రిజర్వేషన్ల పరంగా బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సాయి ఈశ్వర్‌ను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. సాయి ఈశ్వర్‌కు మెరుగైన వైద్యం అందిచంఆలని వైద్యులను తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు.అనంతరం మాజీ మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. సాయి ఈశ్వర్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ మిమ్మల్ని ఎవరు అడిగారని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలకు నిర్మల్ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్త రవీందర్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. నల్లగొండ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్తను మంత్రి కోమటిరెడ్డి అనుచరులు కిడ్నాప్ చేసి మూత్రం తాగించారని పేర్కొన్నారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలు ఏకమై ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీసీ బిడ్డలు ఆవేశాలకు గురై బలవన్మరణాలకు పాల్పడవొద్దని కోరారు




# 1,800 ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చిన ప్రభుత్వం

**హైదరాబాద్:** 22ఏ జాబితా.. దీని గురించి సామాన్యులకు పెద్దగా తెలియకపోవచ్చు కానీ.. భూముల క్రయవిక్రయాలు జరిపేవారికి 22ఏ జాబితా గురించి బాగా తెలుసు. ప్రభుత్వ నిషేధిత భూములు ఈ జాబితాలో ఉంటాయి. ఒక్కసారి భూములు ఈ జాబితాలో చేరితే వాటిని అమ్మడం, కొనడం చేయలేము. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణ ప్రభుత్వం సంచలన నిరయం తీసుకుంది. ఒకటి, రెండు కాదు.. ఏకంగా 1800 ఎకరాల భూమిని నిషేధిత జాబితా(22ఏ)లో చేరుస్తూ ఆదేశాలు జారీ చేసింది.హైదరాబాద్ నగరంలోని శేరిలింగంపల్లి మండలంలో ఉన్న గోపన్‌పల్లి రెవెన్యూ గ్రామంలోని 1,800 ఎకరాల భూము లను ప్రభుత్వం నిషేధిత జాబితా (22ఏ)లోకి చేర్చింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకే ప్రభుత్వం ఈ నిర?యం తీసుకుంది. కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియలో భాగంగానే ప్రభుత్వం ఈ నిర?యం తీసుకుంది. మొత్తం ఈ గ్రామంలో గల భూమిలోని దాదాపు 3వ వంతు భూమిని.. నిషేధిత జాబితాలోకి చేర్చడం సంచలనంగా మారింది.గత 20 సంవత్సరాలుగా.. ఇక్కడ వెలిసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఉన్న భూమి కూడా ఈ జాబితాలో చేరడంతో వీటి




యజమానులు, ఈ భూముల మీద బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నవారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.ఈ భూములకు సంబంధించి రంగా రెడ్డి జిల్లా అధికారులు.. భూ పరిపాలనా ప్రధాన కమిషనర్‌కు లేఖ రాసి.. గోపల్‌పల్లిలోని 18 సర్వే నంబర్లను 22ఏ జాబితాలో చేర్చాలని కోరారు. దీంతో, ఆ భూముల్లో లావాదేవీలను నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఈ జాబితాను పొందుపరిచారు. ఈ భూముల విలువ సుమారు 27 వేల కోట్ల రూపాయలకు పైమాటే అంటున్నారు.ఈ నిషేధిత సర్వే నంబర్లలో చేర్చిన భూముల్లో వందలాది ఐటీ కంపెనీలు, ఎకరాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలతో పాటుగా అనేక ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ప్రభుత్వం పలు ఉద్యోగ శాఖలు, ప్రైవేటు సంస్థలకు కేటాయించిన భూములు ఈ నిషేధిత జాబితాలో చేర్చడం గందరగోళంగా మారింది.గోపన్‌పల్లిలోని 18 వేర్వేరు సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ రికార్డులలో వీటిని ప్రభుత్వ స్థలంగా పేర్కొన్నారు. ద్రేవాదాయ శాఖ, లావాణి పట్టాలు కూడా ఉన్నాయి. రెండు రోజుల క్రితమే శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఈ జాబితా చేరింది. దీంతో ఈ సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లను నిలిపివేసినట్లు సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.గోపన్‌పల్లి రెవెన్యూ గ్రామం.. ఐటీ కారిడార్‌లో భాగంగా ఉంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే టీసీఎస్ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పైగా ఈ గ్రామం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్‌కు సమీపంలో ఉండటంతో ఇక్కడ భూముల విలువ విపరీతంగా పెరిగింది. ఈ ప్రాంతంలో సగటున ఎకరం ధర రూ.150 కోట్లు అనుకుంటే... మొత్తం 1,800 ఎకరాల విలువ బహిరంగ మార్కెట్లో రూ.27 వేల కోట్ల పైమాటే అని అంచనా వేస్తున్నారు.

# కొత్త లేబర్ కోడ్స్‌పై కార్మికుల్లో ఆందోళన

**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండానే నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చింది అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. బీఆర్టీయూ అధక్షుడు రాంబాబు యాదవ్‌తో కలిసి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక చట్టాలను కుదించి 29 కు పరిమితం చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చిందని మండిపడ్డారు. కార్మిక వర్గాలు ఈ కొత్త లేబర్ కోడ్స్‌పై ఆందోళనగా ఉన్నాయన్నారు. చట్టాలు పాస్ చేసే ముందు కార్మికు వర్గాల అభిప్రాయాన్ని కేంద్రం తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.చట్టాలకు నిబంధనలు రూపొందించే క్రమంలో ఇప్పుడు కేంద్రం అభిప్రాయం చెప్పమంటున్నది. బీఆర్ఎస్ పార్టీ తరపున లేబర్ కోడ్‌లపై అభిప్రాయాలు సేకరించి ఓ నిర?యం తీసుకునేందుకు రేపు తెలంగాణ భవన్‌లో ఉదయం పదకొండు గంటల నుంచి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల కార్మికు సంఘాల నేతలు, వివిధ పరిశ్రమల కార్మిక సంఘాల నాయకులు, అసంఘటిత రంగ కార్మిక సంఘాల నేతలు, బీఆర్ఎస్ కార్మిక విభాగం నేతలు ఈ రౌండ్ టేబుల్ మీటింగ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.




# రికార్డ్ బ్రేక్ నాలుగు రోజుల్లో రూ. 600 కోట్ల సేల్స్

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో చలి వాతావరణం జనాల్ని ముప్పుతిప్పలు పెడుతుతోంది. ఉదయం, రాత్రి వేళల్లో ఉష్?గ్రతలు భారీగా పడిపోతున్నాయి. అయితే, చలి వాతావరణంలోనూ మద్యం ప్రియులు వెనక్కుతగ్గటం లేదు. చిల్డ్ బీర్లు తాగి ఎంజాయ్ చేస్తున్నారు. నాలుగు రోజుల్లోనే 5.89 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది నాలుగు రోజుల్లో 4.26 లక్షల కేసుల బీర్లు మాత్రమే అమ్ముడయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది లిక్కర్ సేల్స్ 107 శాతం పెరిగాయి.ఇక, తెలంగాణ వ్యాప్తంగా మద్యం సేల్స్ రికార్డును బ్రేక్ చేశాయి. నాలుగు రోజుల్లోనే దాదాపు 600 కోట్ల రూపాయల మద్యం సేల్స్ జరిగాయి. డిసెంబర్ 1వ తేదీనుంచి



4వ తేదీ రాత్రి వరకు 578.86 కోట్ల మద్యం సేల్స్ జరిగాయి.రెండేళ్లలో 71వేల కోట్ల అమ్మకాలు.2023-25 పాత మద్యం పాలసీ గడువు ఆదివారంతో ముగిసింది. ఈ రెండేళ్లలో మద్యం అమ్మకాలు ఊహిం చని విధంగా పెరిగాయి. గత రెండేళ్లలో 724 లక్షల కేసుల లిక్కర్, 960 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయి.పాతపాలసీ ప్రారంభమైన 2023 డిసెంబర ులో ఏకంగా రూ.4,297 కోట్ల వ్యాపారం జరిగింది. అనంతరం 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు రూ.37,485 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు రూ.29,766 కోట్ల అమ్మకాలు జరిగాయి.

# పళనిలో తెలుగు భక్తుడిపై దాడి అయ్యప్పల ధర్నా



**హైదరాబాద్:** శబరిమల యాత్రలోభాగంగా తమిళనాడులోని పళని సుబ్రమణ్య స్వామి దర్శనానికి వెళ్లిన ఓ తెలుగు భక్తుడిపై దాడి ఉద్రిక్తతకు దారితీసింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ అయ్యప్ప స్వాములు ధర్నాకు దిగారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అయ్యప్ప స్వాముల బ ృందం శబరిమల దర్శనానికి వెళ్తున్నది. ఈక్రమంలో మార్గమధ్యంలో పళనిలోని సుబ్రమణ్య స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఓ భక్తుడు సమీప దుకాణంలో వాటర్ బాటిల్, కూల్‌డ్రింక్స్ కొనుగోలు చేయడానికి వెళ్లారు. అయితే ఎంఆర్‌పీ () రూ.30గా ఉండగా.. దుకాణదారుడు రూ.40 డిమాండ్ చేశాడు. అదేంటని నిలదీయగా.. తమిళంలో తిట్టడం మొదలుపెట్టాడు. గాజు సీసాతో అయ్యప్ప భక్తుడిపై దాడి చేశాడు. దీంతో బాధితుడి తలకు తీవ్ర రక్తగాయమైంది. అంతటితో ఆగకుండా మెడలో దండ తెంపివేశాడు. విషయం తెలుసుకున్న తోటి అయ్యప్ప భక్తులు ఒక్కొక్కరుగా ఘటనాస్థలికి చేరుకున్నారు. దాడికిపాల్పడిన దుకాణదారుడిని నిలదీశారు. ఈ క్రమంలో స్థానికులు ఆ వ్యాపారికి అండగా నిలిచి, అయ్యప్పలతో వాగ్వాదానికి దిగారు. ఆ వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. అక్కడే ఆందోళనకు దిగారు. ఎవరూ స్పందించకపోవడంతో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలకు సర్దిచేప్పే ప్రయత్నం చేశారు. అయినా తెలుగు భక్తులు వెనక్కి తగ్గకపోవడంతో చెదరగొట్టేందుకు యత్నించారు. అయితే క్రమంగా అయ్యప్పల సంఖ్య పెరిగిపోతుండటంతో నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

# యువతిపై రౌడీ షీటర్ అత్యాచారం



**ఏలూరు జిల్లా, డిసెంబర్ 05:** నగరంలో అర్ధరాత్రివేళ అమానుషం జరిగింది. ఓ యువతిపై ఇద్దరు రౌడీ షీటర్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుస్తోంది. అయితే.. ఈ విషయం ఉన్నతాధికారుల ద ృష్టికి వెళ్లడంతో హడావుడిగా కేసు నమోదు చేసినట్టు సమాచారం. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన అసలు వివరాలివీ..ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ యువతి ఏలూరులో తన స్నేహితురాలి వద్ద ఉంటోంది. ఈ నెల 2న అర్ధరాత్రి వేళ.. ఇద్దరు రౌడీ షీటర్లు మద్యం సేవించి వారి ఇంటికి వెళ్లారు. తలుపులు, కిటీకీలు బాదుతూ ఇబ్బందులకు గురిచేశారు. ఇంతలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన యువతి తలుపులు తీయగా.. ఆమెను కొట్టుకుంటూ సమీపంలోని సచివాలయ భవనంలోకి ఈడ్చుకెళ్లాడో రౌడీషీటర్. అనంతరం లైంగికంగా వేధించి అత్యాచారానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి అక్కడ్నుంచి వెళ్లిపోయారా రౌడీ షీటర్లు. ఆ తర్వాత మళ్లీ కాసేపటికే వచ్చి ఇద్దరు యువతులనూ ఇష్టానుసారంగా బెల్టుతో కొట్టి బెదిరించారు. ఈ ఘటనపై బాధిత యువతులిద్దరూ స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే.. అక్కడి సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఇంతలో ఈ విషయం ఉన్నతాధికారుల ద ృష్టికి వెళ్లడంతో.. కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బాధిత యువతిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేస్తున్నట్టు సమాచారం.

# నిబంధనలకు 'నీళ్లు నీటి నాణ్యత గాలికి



**కాకినాడ, డిసెంబర్ 05:** స్వఛ్ఛమైన నీటినే తాగాలి. దీనికి తగినట్టే ప్రస్తుతం జనం మినరల్ బాటపట్టారు. ఎంత ఖరీదైనా సరే.. ఆ నీటినే కొనుక్కుని మరీ తాగుతున్నారు. అయితే.. మనం తీసుకునే ఈ నీరు నాణ్యమైనదేనా? అనే ఆలోచన చాలా మందికి ఉండటం లేదు. ఆర్వో వాటర్ ప్లాంట్ అని కనిపిస్తే చాలు.. అక్కడి నుంచే నీటిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. మరోవైపు నీటి వ్యాపారం బాగుండటంతో వీధికొకటి చొప్పున మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా యి. కాకినాడ జిల్లాలో ఇటీవల కాలంలో తాగు నీటి శుద్ధి ప్లాంట్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. 20 లీటర్ల బాటిల్ నీటిని పట్టుకోవాలంటే రూ.10 నుంచి మొదలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. వాస్తవానికి మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ, పురపాలక సంస్థ నుంచి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని విద్యుత్ శాఖ కనెక్షన్ పొందాలి. ట్రేడ్ లైసెన్స్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్(బీఐఎస్), ఆహార కల్తీ నిరోధక, భూగర‌జేల, ఇతర శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ, ఇవన్నీ ఎవరూ పట్టించుకోవడం లేదు. జలనాణ్యతను పరిశీలించే పరికరాలు, రసాయనాలు, మైక్రో బయాలజిస్టు లేదా కెమిస్టులు ప్లాంటులో పనిచేయాలి. స్టీల్ డ్రమ్ములు, అంతర్గత పైప్‌లైన్, ఏసీలు ఉపయోగించాలి. యంత్రాలకు వాడే ఫిల్టర్‌లను నెలకోసారి శుభ్రం చేయాలి. ప్రతి రోజూ టీడీఎస్ పరికరం ద్వారా నీటి సాంద్రతను పరిశీలించి నమోదు చేయాలి. కానీ, ఇవన్నీ ఎక్కడా జరగడం లేదు. అనుమతులూ తీసుకోవడం లేదు. అన్ని అనుమతులతో ప్లాంట్ ఏర్పాటుకు దాదాపు రూ.50 లక్షలపైనే ఖర్చవుతుందని అంచనా. తూతూ మంత్రంగా ప్లాంట్లు ఏర్పాటు చేసి మినరల్ వాటర్ అంటూ ప్రజల ప్రాణాలతో జలగాటం ఆడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేమి ప్లాంట్లు నిర్వాహకులకు కలిసొస్తోంది. కొందరు ప్లాంట్ల నిర్వాహకులు వాటర్ క్యాన్లనూ సరిగా శుభ్రం చేయడం లేదు. మూడు నెలలు దాటితే ఆల్గలైన్ ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నా.. ఏళ్ల తరబడి పాతవాటినే వినియోగిస్తున్నారు. మూడు నెలలకోసారి మార్చాలనే నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. కాకినాడలో ఇటీవల పలు ఆర్వో ప్లాంట్లను నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు తనిఖీ చేశారు. నీటి శాంపిళ్లను సేకరించి విశాఖకు పంపించగా.. ప్లాంట్ల నిర్వహణ సరిగ్గా లేదని తేలింది.

# వారు మాతోనే ఉన్నారు మావోయిస్టుల సంచలన ప్రకటన



**విజయవాడ, డిసెంబరు5 :** మావోయిస్టులు సంచలన ప్రకటన చేశారు. మావోయిస్టు అగ్రనేత వికల్ప్ పేరుతో ఓ లేఖను (శుక్రవారం) విడుదల చేశారు. ఈ లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి తమతోనే ఉన్నారని స్పష్టం చేశారు. తాము పోలీసులకు లొంగిపోవడానికి ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదని క్లారిటీ ఇచ్చారు. మావోయిస్టు అగ్రనేత హిడ్మా సమాచారాన్ని దేవ్‌జీ చెప్పారనేది అవాస్తవమని తెలిపారు. హిడ్మా హత్యకు నలుగురు వ్యక్తులే కారణమని మండిపడ్డారు. కోసాల్ అనే వ్యక్తి హిడ్మా హత్యకు ప్రధాన కారణమని చెప్పుకొచ్చారు. విజయవాడకు చెందిన కలప వ్యాపారి, ఫర్నిచర్ వ్యాపారి, మరో కాంట్రాక్టర్ హిడ్మా హత్యకు కారకులని తెలిపారు. అక్టోబరు 27వ తేదీన చికిత్స కోసం కలప వ్యాపారి ద్వారా హిడ్మా విజయవాడకు వెళ్లారని మావోయిస్టు అగ్రనేత వికల్ప్ పేర్కొన్నారు. అనంతరం హిడ్మాను పోలీసులు పట్టుకుని ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. కాగా, మావోయిస్టుల చర్యలను అడ్డుకునేందుకు కేంద్రప్రభుత్వం ఆపరే షన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. మావో యిస్టుల చర్యలను భద్రత బలగాలు ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే భద్రత బలగా లకు, మావోయిస్టుల కు మధ్య ఆపరేషన్ జరుగు తోంది. ఈ నేపథ్యంలోనే ఏపీలోని మారేడుమిల్లి లో భద్రత బలగాలు ఇటీవల మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతో పాటు పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌ను మావోయిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది.

# సీసీఐ కేంద్రాల్లో నిలువు దోపిడీ



**గుంటూరు సిటీ,:** సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతు జేబుకు చిల్లు పడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వాళ్లే అన్నదాతలతో ఆడుకుంటున్నారు. సాధారణంగా పరీక్షల్లో వందకు 35 మార్కులు వస్తే పిల్లలను టీచర్లు పాస్ చేస్తారు. అలానే రైతులు తీసుకొచ్చిన పత్తి బండి సీసీఐ కొనుగోలు కేంద్రంలోనికి వెళ్లాలంటే.. క్వింటాల్ కు రూ.20లు చెల్లిస్తేనే పాస్ చేస్తున్నారు. లేదంటే లోనికి పంపేది లేదని మంకుపట్టు పడుతున్నారు. ఇది అప్పటికి చిన్న దోపిడీలా కనిపించినా.. కొనుగోళ్లు పూర్తయ్యే సరికి రూ.కోట్లకు చేరుకుంటోంది. సాధారణంగా రైతులు తీసుకొచ్చిన పత్తి నిల్వలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం నిర్ధారించాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖది. ఈ పని చేసేందుకు ప్రతి సీసీఐ కేంద్రంలో మార్కెటింగ్ శాఖ సూపర్ వైజర్ ను నియమించింది. ఆయా మండలాల నుంచి వచ్చిన రైతుల వివరాలు సీఎం యాప్, కిసాన్ యాప్ లో సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయం సదరు సిబ్బంది పరిశీలిస్తారు. వారు పరిశీలించిన తర్వాతే మిగిలిన కొనుగోలు ప్రక్రియ ఆరంభం అవుతుంది. అదే అదునుగా. ఒకవేళ మార్కెటింగ్ శాఖ సిబ్బంది వివరాలు నిర్ధారించకపోతే సీసీఐ కేంద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. రైతుల ఇటువంటి అవసరాన్ని ఆధారం చేసుకొని క్వింటాల్ కు రూ.20 ఇస్తే కానీ, పత్తి లోడ్ ను పాస్ చెయ్యమని సిబ్బంది తెగేసి చెబుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వే బ్రిడ్జి బరువు ఆధారంగా నగదు ముందే వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ప్రతి రైతు కనీసం రూ.200 నుంచి రూ.400 వరకు చెల్లించి లోపలికి వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. గతంలోనూ ఇదే వ్యవహారంపై దుమారం రేగింది. మార్కెటింగ్ సిబ్బంది చేస్తున్న వసూళ్ల దందాపై ఒక వ్యక్తి రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ కి ఫిర్యాదు చేశారు. రూ.20 అంటే సామాన్యం కాదుసీసీఐ కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి క్వింటాల్ పత్తికి రూ.20 వసూలు చేస్తున్నారన్నది చిన్న విషయంగా తోచినా.. సీజన్ మొత్తంలో అది పెద్ద మొత్తంగానే కనిపిస్తుంది. ఉదాహరణకు గతేడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 9.50 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అప్పుడు కూడా క్వింటాల్ కు రూ.20 వసూలు చేసినట్లు పలువురు మార్కెటింగ్ శాఖ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ లెక్కన గతేడాది సుమారుగా రూ.1.90 కోట్లు వసూలు చేసినట్లు స్పష్టం అవుతుంది. ఇలా వసూలు చేసే సొమ్ము ఆ శాఖలోని కీలకమైన వారి వద్దకు చేరుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. అందువల్ల ఎన్ని ఫిర్యా దులు వచ్చినా అవి బుట్టదాఖలు అన్నట్లుగానే ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దిగుమతి కూలీ రెట్టింపుప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో దింపుడు కూలీ ధరలు ఆసాంతం పెంచేశారు. గతంలో ఉన్న ధర కంటే రెట్టింపు కావడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు చక్రాల ఆటోలో పత్తి తీసుకువస్తే దిగుమతి కూలీ రూ.1000 నుంచి రూ.1200 వరకు తీసుకుంటున్నారు, అదే ట్రాక్టర్ లో తీసుకువస్తే రూ.1500 కు తగ్గకుండా తీసుకుంటున్నారు. లారీలో అయితే ఒక్కో చోట ఒక్కో ధర వసూలు చేస్తున్నారు. దిగుమతి కూలీ వ్యవహారంలో ఒకే విధానం లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. చాలా సందర్భాల్లో ఈ విషయంలో గొడవలు కూడా జరుగుతున్నాయి.

# ఏపీలో విద్యా వ్యవస్థను నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



**పార్వతీపురం మన్యం జిల్లా, డిసెంబరు5 :** విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. పిల్లలు అంటే తనకు చాలా ఇష్టమని.. అందుకే సీఎం చంద్రబాబును అడిగి విద్యాశాఖను తీసుకున్నానని ప్రస్తావించారు. తనకు పేరెంట్స్ మీటింగ్స్ అంటే చాలా భయమని పేర్కొన్నారు. ఏపీ వ్యాప్తంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ శుక్రవారం) నిర్వహించారు. మన్యం జిల్లా బామినిలో పాల్గొని ప్రసంగించారు మంత్రి నారా లోకేశ్. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి విద్యార్థి దశను ప్రస్తావించారు. అలాగే, (శ్రీకాకుళం జిల్లా రచయిత కారా మాస్టరు (కాళీపట్నం రామారావు) సేవలను కొనియాడారు. తాను చదువుకున్నప్పుడు ఎప్పుడూ తన తల్లిదండ్రులు పేరెంట్స్ మీటింగ్‌కు రాలేదని చెప్పుకొచ్చారు. పిల్లలు, తల్లిదండ్రుల త్యాగాలను మరవకూడదని సూచించారు. తల్లి ప్రేమ, తండ్రి త్యాగం ఎంతో గొప్పదని చెప్పుకొచ్చారు. తల్లికి చెప్పలేని ఏ పని కూడా చేయకూడదని సూచించారు. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు మంత్రి నారా లోకేశ్. పాఠ్యపుస్తకాల్లోనూ.. కవర్ పేజీల్లో ఎక్కడ కూడా మహిళలు ఇంటి పని చేస్తున్న చిత్రాలు ప్రచురించకుండా తగ్గించామని చెప్పుకొచ్చారు. 906 పాఠశాలల్లో అనేక విద్యా సంస్కరణలు తీసుకువచ్చామని వివరించారు. ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత తీసుకు వచ్చామని పేర్కొన్నారు. లీప్ యాప్ ద్వారా పిల్లల ప్రగతి, హాజరు, ఇతర విషయాలన్నీ తల్లిదం డ్రులు తెలుసుకునే సదుపాయం కల్పించామని వివరించారు. 2029 నాటికి ఏపీలో విద్యావ్యవస్థను దేశంలోనే ప్రథమ స్థానానికి తీసుకువస్తానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# కల్తీ నెయ్యి, పరకామణి దొంగతనం విషయంలో ఎలాంటి చర్చకైనా సిద్ధం



**తిరుపతి, డిసెంబరు5 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కల్తీ నెయ్యి, పరకామణి దొంగతనంపై ఎలాంటి చర్చకైనా సిద్ధమని సవాల్ చేశారు. శ్రీవారి ఆలయంలో జరిగిన వ్యవహారంపై జగన్ ఎగతాళిగా ఎలా మాట్లాడుతారని ధ్వజమెత్తారు. మీ దేవుడు విషయంలో ఇలాగే వ్యవహరిస్తారా.. అని ప్రశ్నించారు. పరకామణిలో జరిగిన దొంగతనాన్ని వెనుకేసుకురావడం జగన్‌కు తగదని చెప్పుకొచ్చారు. (శుక్రవారం) తిరుపతి వేదికగా మీడియాతో మాట్లాడారు భానుప్రకాశ్ రెడ్డి. వేంకటేశ్వరస్వామితో తాము రాజకీయం చేయడం లేదని... వైసీపీ ప్రభుత్వంలోనే దేవుడును రాజకీ యంగా వాడుకున్నారని ఆరోపించారు. కల్తీ నెయ్యి విచారణలో దర్యాప్తు జరుగుతోందని.. అన్ని వాస్తవాలు బయటకు వస్తాయని చెప్పుకొచ్చారు. స్వామి వారికి నిత్యం భక్తులు దర్శనం తర్వాత కానుకలు సమర్పిస్తారని తెలిపారు. పరకామణి గురించి జగన్ చులకనగా మాట్లాడటం తగదని పేర్కొన్నారు. శ్రీవారి ఖజానాలో దొంగతనం జరిగితే చిన్న చోరీ అని ఎలా అంటారని ప్రశ్నించారు. హిందువుల మనసు గాయపడే విధంగా జగన్ మాట్లాడారని ఫైర్ అయ్యారు భానుప్రకాశ్ రెడ్డి. పరకామణి చోరీ తర్వాత జరిగిన పరిణామంలో జగన్‌కు కూడా వాటా ఉందా అని ప్రశ్నించారు. ఇక నుంచి దొంగతనాలు చేసిన వారు కూడా ఆయన వద్దకు పోతే రాజీ చేయిస్తారా అని ఎద్దేవా చేశారు. ప్రజా నాయకుడు ఇలాంటి మాటలు మాట్లాడుతారా అని ఫైర్ అయ్యారు. జగన్‌కు ఇందులో వాటా ఉండబట్టే రాజీ జరిగిందని అర్థమవుతోందని ఆరోపించారు. దేవుడును అడ్డం పెట్టుకునే రాజకీయాలు తాము చేయమని స్పష్టం చేశారు. వైవీ సుబ్బారెడ్డి గోపూజ చేస్తారని చెబుతున్నారని.. మరీ కల్తీ నెయ్యి వాడినప్పుడు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సిట్ అధికారులను విమర్శించడం సరికాదని అన్నారు. పోలీస్ అధికారులకు వెంటనే జగన్ క్షమాపణ చెప్పాలని భానుప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# శ్రీవారి హుండీ విషయంలో జగన్ క్షమాపణ చెప్పాలి



**నెల్లూరు, డిసెంబరు5 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అహంకారంతో మాట్లాడితే ఏ దేవుడు కూడా క్షమించరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడినందుకు జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. ఇవాళ(శుక్రవారం) నెల్లూరు వేదికగా మీడియాతో మాట్లాడారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ అంటే అంత లోకువగా ఉందా అని ఫైర్ అయ్యారు. పరకామణి చోరీ కేసు విషయంలో అహకారంతో జగన్ మాట్లాడిన తీరును హిందూ సమాజం క్షమించదని వార్నింగ్ ఇచ్చారు. టీటీడీ హుండీ చోరీ చేస్తే తప్పేంటని అంటావా...? అని ఫైర్ అయ్యారు. పవిత్రమైన శ్రీవారి హుండీలో చేయి పెట్టినా తప్పు లేదన్నట్లుగా మాట్లాడుతావా...? అని మండిపడ్డారు. శ్రీవారినే నిలువు దోపిడీ చేశావు. 'వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాత కోరికలు తీరిన భక్తులు తమ నగలను శ్రీవారికి సమర్పించుకుంటారని.. కానీ నువ్వు శ్రీవారినే నిలువు దోపిడీ చేసిన రకం. సీఎంగా ఉన్నప్పుడు శ్రీవారి విషయంలో నువ్వు అనేక పాపాలు చేశావు. ఆ పాపాలే శాపాలై నిన్ను 11 సీట్లకు పరిమితం చేసింది. అయినా ఇంకా విమర్శిస్తునే ఉన్నావు. శ్రీవారి హుండీ నుంచి రూపాయి తీసినా పాపమే... అలాంటిది పరకామణి చోరీ... ఏదో చిన్న చోరీ అంటావా..? నీకు ఎంత ధైర్యం. ఒకటి గుర్తుంచుకో.. నువ్వు చేసిన పాపాలకు ఎక్కడ దాకున్నా మీ దేవుడు కూడా అసహ్యించుకుంటారు. భగవంతుడి విషయంలో అహంకారపూరితంగా మాట్లాడిన నిన్ను మీ దేవుడు కూడా క్షమించరు. శ్రీవారి హుండీ విషయంలో జగన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి. వైసీపీలోని హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు కూడా మరో మతాన్ని విమర్శిస్తే సమర్థించరు' అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

# 400 ఇండిగో విమానాలు రద్దు ఎయిర్‌పోర్టుల్లో ప్యాసింజర్ల పడిగాపులు కేంద్రంపై రాహుల్ విమర్శలు

**దిల్లీ :** దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో కొన్నిరోజులుగా తీవ్రమైన అంతరాయం ఏర్పడుతోంది. నాలుగు రోజులుగా కొనసాగుతున్న సంక్షోభం వల్ల దేశవ్యాప్తంగా వందలాది విమానాలు రద్దు అవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని విమానాశ్రయాల్లో పరిస్థితి నియంత్రణలో లేకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎక్కడ చూసినా లగేజీ- ఆందోళనలో ప్రయాణికులుదిల్లీ విమానాశ్రయంలో వేలాది బ్యాగులు టెర్మినల్‌లో పేరుకుపోయాయి. 12-14 గంటల పాటు ప్రయాణికులు నీరు, భోజనం కూడా అందక తీవ్ర అసహనానికి గురయ్యారు. “12 గంటల నుంచి ఎదురు చూస్తున్నాం. ఒక్కసారి ఒక గంట, మరోసారి రెండు గంటలు అని చెబుతున్నారు. పెళ్లికి వెళ్లాలి, లగేజీ లేదు, సమాచారం లేదు. ఇది మానసిక యాతనే” అని ఒక ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశాడు.హైదరాబాద్, చెన్నై, గోవా విమానాశ్ర యాల్లో కూడా పరిస్థితి భిన్నంగా ఏం లేదు. అక్కడ కూడా కొందరు ప్రయాణికులు ఆగ్రహంతో అరుస్తూ, నినాదాలు చేస్తూ సిబ్బందిని ప్రశ్నిస్తూ కనిపించారు. కొంతమంది ఎయిర్‌లైన్స్ కౌంటర్లను చుట్టుముట్టి వివరాలు అడిగారు. గోవా ఎయిర్‌పోర్టులో పోలీసులు ప్రయాణికులను శాంతింపజేయాల్సి వచ్చింది. రాజకీయ నాయకులు ఇలా!ఇండిగో విమాన రద్దులు, ఆలస్యాల నేపథ్యంలో రాజకీయ నేతలు కూడా స్పందించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇది ప్రభుత్వపు మోనోపాలి మోడల్ ఫలితమని వ్యాఖ్యానించారు. న్యాయమైన పోటీ




లేకపోవడం వల్లనే ఇటువంటి గందరగోళం జరుగుతోందని ఆయన విమర్శించారు. రాజ్యసభలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) ఎంపీ ప్రియాంకా చతుర్వేది నిబంధన 180 కింద నోటీసు ఇవ్వడంతో పాటు పౌర విమానయాన మంత్రిత్వశాఖ స్పందించాలని డిమాండ్ చేశారు. వేలాది ప్రయాణికుల భద్రత, సౌకర్యం ప్రమాదంలో పడటం అత్యంత ప్రాధాన్యమైన అంశమని పేర్కొన్నారు.వివిధ విమానాశ్రయాల్లో ఇండిగో శుక్రవారం నాడు 400కి పైగా విమానాలను రద్దు చేసింది. దిల్లీ విమానాశ్రయంలో బయలుదేరే, రాకపోకలతో సహా 220 కి పైగా విమానాలు రద్దు అయ్యాయి. ముంబయిలో 118 విమానాలు, బెంగళూరులో 100, హైదరాబాద్?లో 75, కోల్‌కతాలో 35, చెన్నైలో 26, గోవాలో 11 ఇండిగో విమానాలను రద్దు చేసింది. విశాఖపట్నం విమానాశ్రయంలో 49 డిపార్చర్లు, 43 అరైవల్స్ రద్దు కాగా, పుణె విమానాశ్రయం 16 అరైవల్స్, 16 డిపార్చర్లు రద్దు చేసినట్లు ప్రకటించింది. పుణెలో పార్కింగ్ బేలు ఇండిగో విమానాలతో నిండిపోవడంతో ఇతర ఎయిర్‌లైన్స్ విమానాలకూ ఇబ్బంది ఎదురైంది. సంక్షోభానికి కారణాలు ఏమిటి?ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ () నూతన దశ అమలులో వచ్చిన మార్పులు, క్రూ ప్లానింగ్‌లో లోపాలు, శీతాకాలం కారణంగా ఆపరేషనల్ పరిమితులు, సిబ్బంది కొరత డీజీసీఏ సమీక్షలో ప్రధాన కారణాలుగా తేలాయి. ఈ నేపథ్యంలో ఇండిగో ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ () నిబంధనల నుంచి ఎయిర్‌బస్ ఏ320 విమానాలకు మినహాయింపు కల్పించాలని డీజీసీఏను కోరింది. డీజీసీఏ ఇంకా నిర్ణయం ప్రకటించలేదు. ఇండిగో స్పందనవిమానాల ఆలస్యం, రద్దుపై ఇప్పటికే ఇండిగో సంస్థ స్పందించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరికి 10 నాటికి ఇండిగో విమానాలన్నీ సాధారణ స్థాయికి చేరుకోలేవని అధికారులు చెబుతున్నారు. ఈనెల 8 నుంచి విమానాలను తగ్గించనున్నట్లు వెల్లడించారు. ఈ అసౌకర్యానికి గానూ ప్రయాణికులకు ఎయిర్‌లైన్ క్షమాపణలు తెలియజేశారు.


# లివిన్ రిలేషన్‌పై రాజస్థాన్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు




**జైపూర్:** రాజస్థాన్ హైకోర్టు లివిన్ రిలేషన్‌షిప్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది. యుక్త వయసు వచ్చిన ఇద్దరు వ్యక్తులు సహజీవనం చేయవచ్చు అని కోర్టు అభిప్రాయపడింది. ఒకవేళ ఆ ఇద్దరికీ పెళ్లి ఈడు రాకున్నా.. లివిన్ రిలేషన్‌లో కొనసాగవచ్చు అని కోర్టు వెల్లడించింది. పెళ్లి వయసు నెపంతో రాజ్యాంగ హక్కుల్ని కొట్టిపారేయలేమని కోర్టు పేర్కొన్నది. జస్టిస్ అనూప్ ధండ్ తన తీర్పులో ఈ వ్యాఖ్యలు చేశారు. 18 ఏళ్ల మహిళ, 19 ఏళ్ల అబ్బాయి.. తాజాగా రాజస్థాన్ హైకోర్టులో పిటీషన్ వేశారు. పరస్పర అంగీకారంతోనే ఇద్దరం రిలేషన్‌లో ఉన్నామని ఆ జంట కోర్టుకు చెప్పింది. 2025, అక్టోబర్ 27వ తేదీన సహజీవనం చేస్తామని ఓ ఒప్పందం కూడా కుదుర్చుకున్న విషయాన్ని ఆ జంట వెల్లడించింది.అయితే అమ్మాయికి చెందన కుటుంబం ఆ లివిన్ రిలేషన్‌ను వ్యతిరేకిస్తున్నది. తమను చంపేస్తామని అమ్మాయి ఫ్యామిలీ బెదిరిస్తున్నట్లు ఆ జంట పిటీషన్‌లో పేర్కొన్నది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును ఎవరూ పట్టించుకోవడం లేదని కూడా ఆ జంట తమ పిటీషన్‌లో ఆరోపించింది. ఆ పిటీషన్‌ను వ్యతిరేకిస్తూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేక్ చౌదరీ వాదించారు. అబ్బాయికి 21 ఏళ్లు నిండలేదని, ఇంకా అతనికి పెళ్లి వయసు రాలేదని కోర్టుకు తెలిపారు. సహజీవనం కొనసాగించేందుకు అతనికి పర్మిషన్ ఇవ్వవద్దు అని కోర్టుకు వెల్లడించారురు.కానీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు కొట్టివేసింది. పెళ్లి వయసు రాలేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, స్వేచ్ఛా హక్కును హరించలేమని కోర్టు పేర్కొన్నది. భారతీయ చట్టాల ప్రకారం లివిన్ రిలేషన్‌ను నిషేధించలేమని, నేరంగా చూడలేమని కోర్టు చెప్పింది. పిటీషన్‌లో ఉన్న అంశాలను పరిశీలించాలని బిల్వారా, జోద్‌పూర్ పోలీసుల్ని జస్టిస్ ధండ్ ఆదేశించారు. యువ జంటకు రక్షణ కల్పించాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది.

# వికసిత్ భారత్‌కు అవసరమైన ప్రతీ సహకారం అందిస్తాం

**న్యూ ఢిల్లీ :**భారత్- రష్యా స్నేహసంబంధాలకు చారిత్రక నేపథ్యం ఉందని రష్యా అధ్యక్షుడు పుతిన్? పేర్కొన్నారు. ద్వైపాక్షిక భేటీలో ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మోదీ, తాను చర్చించామని చెప్పారు. భారత్?కు నిరంతరాయంగా ఇంధన సరఫరా చేస్తామని పుతిన్ హామీ ఇచ్చారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో భాగంగా ఆయిల్, గ్యాస్ బొగ్గు అన్నింటినీ సరఫరా చేస్తామని వెల్లడించారు. వికసిత్ భారత్?కు అవసరమైన ప్రతీ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. భారత ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్ ప్రసంగించారు.“ఇంధన రంగంలో కూడా విజయవంతమైన భాగస్వామ్యం ఉంది. భారత ఇంధన రంగం అభివృద్ధికి ఆయిల్, గ్యాస్, బొగ్గుతో సహా అవసరమయ్యే అన్నింటిని సరఫరా చేయడానికి మేము భారత్‌తో వ్యాపార భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాం. వేగంగా ఎకానమీ వృద్ధి చెందుతున్న భారత్‌కు అంతరాయం లేకుండా ఇంధన సరఫరాను కొనసాగించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. మేము అతిపెద్ద భారత అణు విద్యుత్ కేంద్రాన్ని నిర్మించే ప్రాజెక్టుపై పని చేస్తున్నాం. ఇప్పటికే ఆరు రియాక్టర్లలో మూడింటిని ఇంధన నెట్‌వర్క్‌కు అనుసంధానించాం. మీతో



సంతోషంగా ఒకటి పంచుకోవాలని కోరుకుంటున్నాను. ద్వైపాక్షిక చెల్లింపుల కోసం భారత్, రష్యా క్రమంగా జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులుతున్నాయి. వాణిజ్య చెల్లింపులలో దీని వాటా ఇప్పటికే 96 శాతం ఉంది.’పుతిన్, రష్యా అధ్యక్షుడుద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాంఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని, రెండు దేశాల వాణిజ్యం 64 బిలియన్ డాలర్ల నుంచి వంద బిలియన్ డాలర్లకు పెరగాలని ఆకాంక్షించారు. ఇరుదేశాల ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. చమురు, సహజవాయువు, బొగ్గు సరఫరాకు ఒప్పందాలు చేసుకున్నామని, వైద్య, వ్యవసాయ రంగాల్లో కలిసి ముందుకెళ్తామని వివరించారు.“మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. ముఖ్యంగా ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం. ఇరుదేశాల వాణిజ్యం 64 బిలియన్ డాలర్ల నుంచి వంద బిలియన్ డాలర్లకు పెరగాలి. ఇరుదేశాల ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నాం. ఇరుదేశాల మధ్య రవాణా అనుసంధానం పెంచడం మా లక్ష్యం. అంతర్జాతీయ ఉత్తర, దక్షిణ రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేస్తాం. భారత్‌లో అతిపెద్ద న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరిస్తాం. చమురు, సహజవాయువు, బొగ్గు సరఫరాకు ఒప్పందాలు చేసుకున్నాం. వైద్య, వ్యవసాయ రంగాల్లో కలిసి ముందుకెళ్తాం. పరిశ్రమల స్థాపన, ఆధునిక యంత్రాల తయారీలో సహకారం అందిస్తాం. రష్యాలో భారతీయ భాషల చిత్రాలను ప్రోత్సహిస్తాం. అణువిద్యుత్ సహా పలు రంగాల్లో కీలక ఒప్పందాలు చేసుకున్నాం. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ, వాణిజ్య ఒప్పందాలు జరిగాయి.” అని పుతిన్? అన్నారు.

# దేవస్థానం సంపద దేవునిదే సుప్రీం సంచలన తీర్పు



**న్యూ ఢిల్లీ :**దేవస్థానాలకు సంబంధించిన సంపదపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పు నిచ్చింది. దేవస్థానం సంపద దేవునిదేనని స్పష్టం చేసింది. దేవస్థానం డబ్బును సహకార బ్యాంకుల మనుగడకు ఉపయోగించరాదని తేల్చి చెప్పింది. దేవస్థానం డిపాజిట్లను తిరిగి ఇవ్వాలన్న కేరళ హైకోర్టు ఆదేశాలను కేరళ సహకార బ్యాంకులు సుప్రీంకోర్టులో సవాలు చేశాయి. దీనిపై సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. కేరళ హైకోర్టు తీర్పులో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు తెలిపింది.విచారణ సందర్భేగా జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. ‘సహకార బ్యాంకుల్ని కాపాడటం కోసం గుడి డబ్బుల్ని వాడతారా? దేవుడి డబ్బుల్ని కేవలం గుడి ప్రయోజనాల కోసం మాత్రమే వాడాలి. అది ఆదాయ మార్గం కాకూడదు. సహకార బ్యాంకుల్ని కాపాడే మార్గం అస్సలు కాకూడుదు. సహకార బ్యాంకులు ప్రజల నమ్మకాన్ని పొందాలి. కస్టమర్లను ఆకర్షించలేకపోవటం..అన్నది సహకార బ్యాంకుల సమస్య’ అని అన్నారు.

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’లోకి బిహార్ సీఎం నీతీశ్


**బిహార్ :** ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ ‘వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’ చోటు సంపాదించారు. ఏకంగా 10సార్లు బిహార్ సీఎం కావడంతో ఆయనకు ‘వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’లో స్థానం లభించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ బ్రిటన్ రాజధాని లండన్‌లోని ‘వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’ సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి సీఎం నీతీశ్‌కు ఒక ప్రశంసా పత్రం అందింది. నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణ స్వీకారం చేయడం ద్వారా చారిత్రక రికార్డును సృష్టించారని తెలిపింది. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో 1947 నుంచి 2025 వరకు ఒక రాష్ట్రానికి పదిసార్లు ముఖ్యమంత్రిగా సేవలు అందించిన తొలి నేత నీతీశ్ కుమార్ అని ప్రశంసా పత్రంలో పేర్కొంది. ఈ విజయం బిహార్‌తో పాటు యావత్ భారతదేశానికే గర్వకారణమని కొనియాడింది.నీతీశ్‌ది అత్యంత అరుదైన, విశేషమైన విజయం“నీతీశ్ కుమార్ రికార్డు భారత ప్రజాస్వామ్య స్థిరత్వం, ఆయన బలమైన నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న అంకితభావానికి ప్రతీక. ఒక రాష్ట్రానికి పదిసార్లు సీఎం అయ్యే అవకాశం దక్కడం ఏ ప్రజాస్వామిక వ్యవస్థలోనైనా




అత్యంత అరుదైన, విశేషమైన విజయం. ఈ విజయం మరెంతో మందికి వ్యక్తిగత ప్రేరణ అందిస్తోంది. పరిపాలనా స్థిరత్వం, అభివృద్ధి, సామాజిక సంక్షేమం పట్ల నీతీశ్‌కు ఉన్న నిబద్ధతను బిహార్ ప్రజలు బలంగా నమ్ముతున్నారు. ఆయన పాలనా విధానాలు, దూరదృష్టిపై ప్రజలు నిస్సంకోచంగా ఆమోద ముద్ర వేస్తున్నారు. నీతీశ్‌ది ఒక ఆదర్శప్రాయమైన విజయం. ఇది జాతీయ, అంతర్జాతీయ స్థాయి రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది. అందుకే నీతీశ్ కుమార్ పేరును అధికారికంగా ‘వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’లో చేర్చాం. ఆయనకు అధికారిక ధ్రువీకరణ పత్రం కూడా అందిస్తాం” అని ప్రశంసా పత్రంలో ‘వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’ సంస్థ ప్రస్తావించింది.అంతర్జాతీయ స్థాయికి నీతీశ్ విజయం : సంజయ్ ఝా, జేడీయూ“నీతీశ్ కుమార్ పేరు ‘వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’లోకి ఎక్కడం చాలా సంతోషాన్ని కలిగించే అంశం. నీతీశ్‌కు ఈ గౌరవం దక్కడం యావత్ బిహార్ రాష్ట్రానికి గర్వకారణం. అత్యధికంగా 10సార్లు బిహార్ సీఎం అయినందుకు నీతీశ్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. నిజంగానే ఇది అరుదైన విజయం. సీఎంగా ఇన్ని ఛాన్స్‌లు ఇప్పటిదాకా ఎవరికీ రాలేదు. సీఎం నీతీశ్‌ను అభినందిస్తూ ‘వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్’ నుంచి ప్రశంసా పత్రం వచ్చింది. నీతీశ్ సాధించిన రాజకీయ విజయం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి చర్చనీయాంశంగా మారింది. బిహార్ వికాసం కోసం నీతీశ్ చేస్తున్న నిరంతర కృషి మరోసారి ప్రపంచానికి తెలిసింది” అని పేర్కొంటూ జేడీయూ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా ‘ఎక్స్’ వేదికగా ట్వీట్ చేశారు.

# మమ్మల్ని క్షమించండి.. డిసెంబర్ 10 నుంచి యథావిధిగా సర్వీస్‌లు

**ఢిల్లీ :** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభం ఇప్పట్లో సమసిపోయేలా లేదు. వందల సంఖ్యలో సర్వీస్‌ల రద్దుతో ప్రయాణికులు అగచాట్లు పడుతున్న వేళ.. కేంద్రప్రభుత్వం అత్యున్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ముంబై, ఢిల్లీ విమానాశ్రయాల్లో భారీగా ప్రయాణికులు నిరీక్షిస్తున్న అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు నష్టాలు.. మరోవైపు



ప్యాసింజర్స్ కష్టాలపై శుక్రవారం ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బెర్స్కలక ప్రకటన చేశారు. ఊహించని అంతరాయానికి తమను క్షమించాలని కోరిన ఆయన.. శుక్రవారం ఒక్కరోజే వెయ్యికిపైగా విమానాలు రద్దు చేశామని వీడియో మెసేజ్ విడుదల చేశారు.‘కొన్ని రోజులుగా విమాన సర్వీస్‌ల విషయంలో అంతరాయాలు చూస్తున్నాం. అప్పటి నుంచి ఈ పరిస్థితి మరింత జఠిలంగా మారింది. డిసెంబర్ 5, శుక్రవారం మాత్రం సర్వీస్‌లపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఒక్కరోజే 1000కి పైగా విమానాలను రద్దు చేశాం. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందుకు నా తరఫున, మా సంస్థ ఇండిగో తరఫున మీఅందరికీ క్షమాపణలు తెలియజేస్తున్నా. సర్వీస్‌లు ఆలస్యంగా నడవడం, పలు విమానాలు రద్దు కావడంతో చాలామంది కష్టాలు పడుతున్నారు. ఇండిగోలో సాధారణ పరిస్థితులు నెలకొనడానికి కనీసం పది రోజులు పట్టేలా ఉంది. డిసెంబర్ 10-15 వరకూ సర్వీస్‌లు యథావిధిగా నడిచే అవకాశముంది’ అని పీటర్స్ పేర్కొన్నారు.

# నచ్చిన వాచీలు పెట్టుకుంటాం శాంటోస్ డి కార్టియర్ వాచ్‌పై డీకే క్లారిటీ

**బెంగళూరు:** కరాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఒకే రకమైన ఖరీదైన వాచీలు ధరించడం చర్చనీయాంశమవుతోంది. డీకే ధరించిన శాంటోస్ డి కార్డియర్ వాచ్‌ను లెక్కల్లో చూపించలేదంటూ శాసన మండలిలో విపక్ష నేత చదలవాడి నారాయణ స్వామి ఇటీవల వ్యాఖ్యానించడం తాజా చర్చకు కారణమైంది. అయితే ఈ ఆరోపణలను డీకే శివకుమార్ శుక్రవారంనాడు ఖండిం చారు. తన ఆస్తులన్నీ పారదర్శకంగా ఉన్నాయని చెప్పారు. బాధ్యత కలిగిన నారాయణస్వామి వంటి వ్యక్తులు ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం తగదని అన్నారు.తన వద్ద రూ.9 లక్షలు విలువచేసే రోలెక్స్, రూ.23.9 లక్షలు, రూ.12.06 లక్షలు విలువ చేసే రెండు కార్టియర్ వాచ్‌లు ఉన్నట్టు లోకాయుక్తకు తాను అఫిడవిట్ సమర్పించానని డీకే తెలిపారు. ఆ డాక్యుమెంట్ కాపీని కూడా ఆయన సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో షేర్



చేశారు.‘మిస్టర్ నారాయణ స్వామి... ఇదిగో నేను లోకాయుక్తకు సమర్పించిన అఫిడవిట్. మీలాంటి బాధ్యతల కలిగిన వ్యక్తి ముందువెనుకలు చూసుకోకుండా మాట్లాడటం తగదు. ఇందు వల్ల మీకు పెరిగే గౌరవం ఏమీ ఉండదు. నేను పారదర్శకంగా ఉండే వ్యక్తిని. నిజమే చెబుతాను, ఏదీ దాటిపెట్టే ప్రసక్తే లేదు’ అని డీకే పేర్కొన్నారు. నచ్చిన వాచ్‌లు ధరించే హక్కు తనకు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఉందని స్పష్టం చేశారు.దీనికి ముందు నారాయణ స్వామి మాట్లాడుతూ, సీఎం, డిప్యూటీ సీఎం ఒకరకమైన వాచ్‌లు ధరించడం బాగానే ఉందని, అయితే ఆయన (డీకే) అబద్ధం చెప్పడం ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ అఫిడవిట్‌లో రోలెక్స్ వాచ్ (రూ.9 లక్షలు), హబ్లాట్ వాచ్ (రూ.23.9 లక్షలు) ఉన్నట్టు ఆయన పేర్కొన్నారని, కానీ సిద్ధరామయ్య, శివకుమార్‌లు కార్టియర్ వాచ్‌లు ధరించారని అన్నారు. ‘మీరెక్కడ కార్టియర్ గురించి డిక్లేర్ చేశారు? అది దొంగిలించిన ఆస్తా, కొన్న ఆస్తా’ అని ప్రశ్నించారు. కాగా, గతంలో సిద్ధరామయ్య మొదటిసారి సీఎంగా ఉన్నసమయంలో ‘హబ్లాట్ వాచ్’ వివాదం తలెత్తడంతో దాన్ని స్టేట్ ప్రాపర్టీగా పేర్కొంటూ అసెంబ్లీ సెక్రటేరియట్‌కు ఆయన అందజేశారు.

# శ్రీలంక ను కుదిపేసిన దిత్వా .. 486 మంది మృతి

**శ్రీలంక :** దిత్వా తుఫాన్ ద్వీప దేశం శ్రీలంకను కుదిపేసింది. తుఫాను బీభత్సానికి కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడికక్కడ వరదలు () సంభవించాయి. ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక పట్టణాలు పూర్తిగా నీట మునిగాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. దిత్వా తుఫాను బీభత్సానికి భారీగా ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. నవంబర్ 16 నుంచి ఇప్పటి వరకూ 486 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 341 మంది ఆచూకీ గల్లంతయింది. ఈ సంక్షోభ సమయంలో భారత దేశం శ్రీలంకకు అండగా నిలుస్తోంది. ‘ఆపరేషన్ సాగర్ బంధు’ పేరుతో మానవతా సాయాన్ని అందజేస్తోంది. జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), భారత వాయు సేన ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి.

# పాకిస్థాన్ రక్షణ దళాల తొలి చీఫ్‌గా అసిమ్ మునీర్ నియామకం

**ఇస్లామాబాద్:** ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిమ్ మునీర్ మరింత శక్తివంతంగా తయారయ్యారు. రక్షణ దళాలకు తొలి చీఫ్‌గా ఆయన్ను నియమిస్తూ పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి ఆదేశాలు జారీ చేశారు. అయిదేళ్ల పాటు అసిమ్ మునీర్ .. సీడీఎఫ్(చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్)గా కొనసాగనున్నారు. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ పదవి కోసం మునీర్ పేరును పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రతిపాదించారు. అయితే ఆ ప్రతిపాదనకు ఆమోదం దక్కినట్లు పాక్ అధ్యక్ష కార్యాలయం తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసింది.చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్



పాత్రను ఇటీవల పాకిస్థాన్ క్రియేట్ చేసింది. రాజ్యాంగంలో 27వ సవరణ ద్వారా గత నెలల ఈ పాత్రను ఏర్పాటు చేసింది. మిలిటరీ కమాండ్‌ను కేంద్రీకృతం చేసేందుకు పాక్ సర్కారు ఈ నిర?యం తీసుకున్నది. అసిమ్ మునీర్‌కు మరిన్ని అధికారాలు ఇవ్వాలని షెహబాజ్ సర్కారు కొన్నాళ్లుగా ప్రయత్నిస్తున్నది. వాస్తవానికి నవంబర్ 29వ తేదీన ఆర్మీ చీఫ్‌గా మునీర్ మూడేళ్ల కాలపరిమితి ముగిసింది. జహీర్ అహ్మద్ బాబర్ సిద్దు సర్వీసును కూడా మరో రెండేళ్లకు పొడిగించారు. పాక్ సైనిక బలగాల ఆఫీసర్లు ఇద్దరికీ అసిఫ్ అలీ జర్దారి బెస్ట్ విషెస్ చెప్పారు.

# ఓట్ల రాజకీయంలో కుదేలవుతున్న ఆర్థిక వ్యవస్థ !

సమాజాం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను ప్రభుత్వాలు అస్సలు పట్టించుకోవడం లేదు. ఏదైనా ఘోరం జరినప్పుడు సంతాపం తెలియచేయడం.. తరవాత మర్చిపోవడం షరమామూలుగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పాలనలో కొత్తదనం కనిపించడంలేదు. భవిష్యత్ నిర్మాణం దిశగా వారి ఆలోచనలు లేవు. అధికారం ఉందికదాని ప్రజాధానం వృధాగా ఖర్చు చేస్తున్నారు. లక్షల కోట్లు అప్పులు చేసి కుప్పలు పెడుతున్నారు. కెసిఆర్, జగన్ బాటలోనే రేవంత్, చంద్రబాబు నాయుడుల పాలన సాగుతోంది. ఉట్టి కెగరలేనమ్మ ఆకాశానికి ఎగిరిందన్న రీతిలో పాలకుల తీరు ఉంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక్కడ గ్రామాల్లో ప్రధానంగా కోతల బెడద విపరీతంగా ఉంది. గత సిఎం కెసిఆర్ కోతులు వాపస్ పోవాలె అని నినాదం ఇచ్చారు. అది అక్కడికే ఆగిపోయింది. కోతులుకూడా కెసిఆర్‌వి కోతలే అనుకున్నాయేమో గ్రామాలు వదలడం లేదు. గ్రామాలు మొదలుకుని పట్టణాల వరకు వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మొన్నటికి మొన్న వీధి కుక్కల బారిన పడి ఓ మూగబాలుడు ఆస్పత్రి పాలయ్యాడు. వీటిని నిరోధించే కార్యక్రమం చేపట్టడం లేదు. కోతుల కారణంగా తెలంగాణ పల్లెల్లో జనజీవనం తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటలు నాశనం అవుతున్నాయి. ఇళ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి. ప్రజలపై పడి రక్కుతున్నాయి. దీంతో ప్రతి ఇల్లూ ఓ జైలులాగా తయారయ్యింది. ఇంటికి గేట్లు పెట్టుకుని ప్రజలు తాళాలు వేసుకుంటున్నారు. తినడానికి గతిలేని వారు కూడా ఇంటికో గేటు పెట్టుకోవడం తప్పనిసరి
అయ్యింది. తాజాగా ఈ విషయాన్ని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి లోక్‌సభలో ప్రస్తావించారు. తెలంగాణతో పాటు దేశం యావత్తూ సమస్య ఉందన్నారు. దీనిపై జాతీయ విధానం తీసుకోవాలని, కోతుల నిర్మూలన చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ ఆయన అధికారపార్టీ ఎంపి అయినా చెవిటివాడి ముందు శంఖం పూరించినట్లే. దీనిపై స్పందిస్తారని అనుకోవడానికి లేదు. ఎందుకంటే పార్లమెంట్ ఆవరణలోకి కుక్కతో వచ్చారని కాంగ్రెస్ ఎంపి రేణుకాచౌదరిపై అధికార పార్టీ ఎంపి జగదాంబికాపాల్ రచ్చ చేశారు. ఇలాంటివి చేయడం సులభమే కానీ..వీధి కుక్కల బెడదను తప్పించే ప్రయత్నం మాత్రం చేయరు. ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత బస్సు పేరుతో వందలకోట్లు తగలేస్తున్నారు. ఉచిత బస్సు బదులు టిక్కెట్ల రేట్లు తగ్గించి, రోడ్లు వేసి, బస్ సర్వీసులను పెంచితే ప్రజలందరికీ ఉపయోగం. ఇవన్నీ ఎందుకు చర్చించాల్సి వస్తోందంటే సామాజిక సమస్యలపై ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉంటున్నాయి. గ్రామాల్లో కోతులు నిర్మూలించే వారికే ఓటు వేస్తామని పలు గ్రామాల్లో ప్రకటనలు చేస్తున్నారు. పోస్టర్లు అంటిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు. దీనిగురించి ఆలోచించాలి. ఇదొక్కటే కాదు..ఉచితాలపై ఆలోచించాలి. సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్న ఉచిత పథకాలపై ఆలోచన చేయాలి. లేకుంటే దేశం అధోగతి పాలు కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పోటీపడి అమలు చేసే ఉచిత పథకాల వల్ల అభివృద్ధి కుంటు పడుతుందని గుర్తించాలి. అప్పులు చేసి ఉచిత పథకాలను అమలు చేయడం మంచిది కాదని వీరు గుర్తించడం లేదు. ఉచిత బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ఇవే కాకుండా దండగమారి ఖర్చులు కూడా తగ్గించాలి. హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల ఖర్చులు కూడా వేలకోట్లల్లో ఉంటున్నాయి. రాజకీయ నాయకులు తమ పర్యటనలు, వ్యక్తిగత ఖర్చులు చూస్తే గుండె గుభేల్ మంటోంది. మాజీ



సిఎం కెసిఆర్ ఐటి రిటర్న్ కూడా ప్రభుత్వ డబ్బులతోనే వెళ్లదీసారు. అసెంబ్లీకి రాకున్నా జగన్,కెసిఆర్ లక్షల్లో జీతాలు పొందుతున్నారు. నిజానికి ఇవన్నీ తగ్గించు కోవాల్సిందే. ప్రజలనుకూడా ఉచిత పథకాలతో సోమరిపోతులను తయారుచేయడం తప్ప మరోటి కాదు.
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అభివృద్ధికి సూచిక కానేకాదు. ఈ పథకాన్ని అమలుచేయాలని మహిళలెవరూ కోరలేదు. దీనిని గొప్పగా ప్రకటించుకుని ఇన్ని వందల కోట్లు ఆర్టీసికి కట్టామని చెప్పు కోవడం సిగ్గుచేటు. అర్హులైన పేదవారి అభివృద్ధికి ప్రభుత్వాలు నిర్మాణాత్మకమైన సహాయ సహకారాలు అందించడంలో తప్పులేదు. అయితే ప్రజలను సోమరిపోతులుగా మార్చే ఉచిత పథకాలు ప్రగతిని దెబ్బతీస్తాయి. ఉచిత పథకాల వల్ల అనర్హులు సైతం వాటిని పొందడం ఎలా అని చూస్తున్నారు. తప్పుడు మార్గాలు అవలంబించి తమ పేర్లు పథకాల్లో ఉండేలా పైరవీలు చేస్తున్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఒరింగేదమి లేదు. ఆ డబ్బులను రోడ్లు బాగు చేయడానికి, బస్ టిక్కెట్ రేట్లను తగ్గించి, సర్వీసులను పెంచడానికి ఉపయోగిస్తే బాగుండేది.చార్జీ చెల్లించి ప్రయాణం చేయలేని వృద్దులు, వికలాంగులు, విద్యార్థులు, మహిళలకు ఈ సౌకర్యం కల్పిస్తే అభ్యంతరం ఉండదు. కానీ అందరినీ ఒకే గాటన కట్టి అమలు చేయడం సరికాదు. ప్రభుత్వ ఉద్యోగులైన స్త్రీలు, ఆర్థికంగా ఉన్న స్త్రీలు ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనవసర ప్రయాణాలు పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంత నష్టం కలిగినా ఫరవాలేదు, మా పార్టీ ఎన్నికల్లో గెలవాలనే దుర్నీతిని రాజకీయ పార్టీలు అనుసరించి, ఉచిత పథకాలను అమలు చేస్తున్నాయి. వృద్ధాప్య పింఛన్లు, వికలాంగుల పింఛన్ల విషయంలో అనేక అవకతవకలు బయటపడు తున్నాయి. వాస్తవిక వయసును తగ్గించి, బోగస్ ఆధార కార్డులు పొంది, వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న కేసులు ఎన్నో ఉన్నాయి. అంగవైకల్యం లేకపోయినా, డాక్టర్లను మేనేజ్ చేసి అనేకమంది వికలాంగుల పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక రేషన్ కార్డులు, బియ్యం జనాభాను మించి అమలు అవుతున్నాయి. రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేసే బియ్యం మాఫీయాలకు ఆదాయ వనరుగా మారింది. ఏపిలో పోర్టు నుంచి టన్నులకొద్దీ బియ్యం తరలినట్లు ప్రభుత్వమే గుర్తించింది. ప్రభుత్వం కిలో బియ్యానికి 42 రూపాయలు ఖర్చు చేస్తోంది. రేషన్ బియ్యం తినడానికి ఇష్టపడని ప్రజలు కేజీ 12 రూపాయల వంతున బయట అమ్ముకుంటున్నారు. వేల కోట్ల రూపాయలు ప్రజాధనం ఇలా వృథా అయిపోతోంది. ఈ విషయంలో పత్రికలు గానీ, రాజకీయ నాయకులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గానీ, జాతీయవాద సంస్థల నాయకులు గానీ చర్చించడం లేదు. ఎక్కడ తమ ఓట్లు పోతాయో అన్న భయం వారిని వెన్నాడుతోంది. అందుకే విపక్షంలో ఉన్నవారు సైతం ఉచిత పథకాలు మరిన్ని అమలుకు పట్టుబడుతున్నారు. ఉచిత పథకాలకు ఖర్చు చేసే ధనాన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తే రాష్ట్రాలు బాగుపడతాయి. విద్య,వైద్యరంగాలకు ఖర్చు చేయాలి. రోడ్లు అభివృద్ధి చేయాలి. కొతులు, కుక్కలను తరిమేందుకు ఉపయోగించాలి. దోమల నివారణకు ఉపయోగించాలి. చెత్త వేయకుండా నిరోధించాలి.

# గురువును దైవంగా భావించే సంస్కృతి మనది

**మనపై ఉపాధ్యాయుల ప్రభావమే ఎక్కువ**

**చదువుకు మీడియం అడ్డంకి కాదు**

**చిలకలూరిపేట పేరెంట్స్ మీట్‌లో పవన్ కళ్యాణ్**




**పల్నాడు,డిసెంబర్5:** గురువును దైవంగా భావించే అరుదైన సంస్కృతి మనదని, తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయులే మనల్ని ఎక్కువగా ప్రభావితం చేస్తారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. చదువు చాలా బలమైన ఆయుధమని, లక్ష మెదళ్లను కదిలించే శక్తి విద్యకు మాత్రమే సాధ్యమని అన్నారు. ఏ మాధ్యమంలో చదివామనేది ముఖ్యం కాదని.. విభిన్న అంశాలపై పట్టు సాధించడం ముఖ్యమని సూచించారు. అబ్దుల్ కలాం వంటి వారు తమిళ మాధ్యమంలో చదివి మిసైల్ మ్యాన్‌గా, రాష్టపతిగా ఎదిగారని గుర్తుచేశారు. చిలకలూరిపేట ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సమావేశాలు నిర్వహించాలన్న మంత్రి లోకేష్ ఆలోచన అద్భుతమని డిప్యూటీ సీఎం ప్రసంసించారు. మైలవరపు కృష్ణ తేజ తాతగారు గుండయ్య పేరుతో కూడలి ఉండటం ఆయన సేవా నిరతిని గుర్తు చేసిందన్నారు. అప్పట్లో పెద్దలు పాఠశాలలకు స్థలాలు ఇచ్చేవారని, కానీ ఇప్పుడు కొందరు స్థలాలు లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పవన్ కళ్యాణ్ పలు కీలక విషయాల గురించి మాట్లాడారు. పిఠాపురంలో విద్యార్థుల మధ్య చిన్న గొడవను కులాలకు అంటగట్టారని మండిపడ్డారు. కేరళలో తల్లిదండ్రుల సంఘాలు చాలా బలంగా ఉంటాయని, క్రియాశీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి సమావేశాల కారణంగా పిల్లల బలాబలాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం 67 లక్షల మందికి అందించినట్లు తెలిపారు. పిల్లలు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ చాలా అద్భుతంగా ఉందని, వారు తయారు చేసిన పరికరాలు నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. స్కూల్ క్రీడా మైదానం సరిపోవడం లేదని విద్యార్థులు తన దృష్టికి తెచ్చారని, క్రీడా మైదానం సమకూర్చే విషయం విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించాలని అన్నారు. గ్రంథాలయంలో పిల్లల సంఖ్యకు సరిపడా పుస్తకాలు లేవని, తన వైపు నుంచి పూర్తి స్థాయి గ్రంథాలయం ఏర్పాటు చేసి పుస్తకాలు అందిస్తానని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. పిల్లల ఆలోచనలు మెరుగు పర్చటానికి లైబ్రరీ ఎంతో అవసరమని, ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు జనసేన నేతలు, కార్యకర్తలు చేయూత అందించాలని కోరారు. పాఠశాలలో పది కంప్యూటర్లు మాత్రమే ఉన్నాయని, తన వైపు నుంచి 25 కంప్యూటర్లు పంపిస్తానని స్పష్టం చేశారు. బాలికలకు ఆత్మరక్షణ విద్య చాలా ముఖ్యమన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారం చాలా అవసరమని వివరించారు. చిన్నప్పుడు సోషల్ టీచర్ చెప్పిన అంశాలు తనన్ను ఇప్పుడు బలంగా నిలబెట్టాయన్నారు. విద్యార్థులను భవిష్యత్తు కోసం తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు.మన జీవితాలను మార్చిన శాస్త్రవేత్తలను గుర్తు పెట్టుకుని గౌరవించటం తన తల్లి నుంచి నేర్చుకున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిలోనూ నిగూఢమైన శక్తి ఉంటుందని వ్యాఖ్యానించారు. బూతులు మాట్లాడే రాజకీయ నాయకులను పట్టించుకోవద్దని, సినిమా కూడా చిన్న వినోదం మాత్రమేనని అన్నారు. మీ ఆలోచనలు, ప్రవర్తన మన దేశ భవిష్యత్తుని నిర్ణయిస్తాయన్నారు. స్థలాలు లాక్కునే వారి వల్లే పిల్లలకు క్రీడా మైదానాలు దొరకటం లేదని, స్కూల్ గ్రౌండ్ ఏర్పాటు విషయం అధికారులు త్వరగా ఆలోచించాలని సూచించారు. ఈ క్రమంలోనే, మాదకద్రవ్యాలతో తీవ్ర అనర్థం జరుగుతుందని, యువత అటు వైపు అస్సలు చూడొద్దని కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పోలీసులు దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు. గుంటూరు శేషేంద్ర శర్మ విద్యార్థుల భవిష్యత్తుపై రాసిన మాటలు స్ఫూర్తినిచ్చాయన్నారు. మనం సంపాదించినవి పోవచ్చు.. కానీ చదువు, జ్ఞానం ఎప్పటికి పోవని, వాటిని ఎవరూ దొంగిలించలేరని పేర్కొన్నారు. స్వయం వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పాఠాలు చెబితే ఎందరో సమర్థులు తయారవుతారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

# టాటా ట్రస్టు నుంచి భారీగా ఎన్నికల విరాళాలు..

## ఒక్క పైసా అందుకోని టీడీపీ, జనసేన!

గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రముఖ దేశీయ అతిపెద్ద వ్యాపార సంస్థల సమూహమైన టాటా గ్రూపు పెద్ద ఎత్తున విరాళాలు అందజేయడం చర్చనీయాంశం అవుతోంది. ఎన్నికలకు ముందు అధికార బీజేపీతోపాటు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి కూడా టాటా గ్రూపు విరాళాల అందజేసింది.
అదేవిధంగా వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలకు నిధులు సమకూర్చిన టాటా గ్రూపులోని ప్రొగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్టు కొన్ని ముఖ్యమైన పార్టీలను విస్మరించడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. టాటా గ్రూప్ తన వ్యాపారాల ప్రయోజనాలను



దృష్టిలో ఉంచుకోవడంతోపాటు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాజకీయ పార్టీలకు ఎన్నికల విరాళాలు సమకూర్చుతుంటుంది. దేశంలోని ఇతర పెద్ద కార్పొరేట్ సంస్థల మాదిరిగానే టాటా గ్రూప్ కూడా విరాళాలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయితే దేశంలోని మొత్తం పది పార్టీలకు విరాళాలు ఇచ్చిన టాటా గ్రూపునకు చెందిన పీఈటీ అత్యధికంగా కేంద్ర ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న బీజేపీకి రూ.757 కోట్లు అందజేయడమే చర్చనీయాంశం అవుతోంది. మొత్తం పది పార్టీలకు కలిపి రూ.914 కోట్లు విరాళంగా ఇవ్వగా, అందులో 83 శాతం నిధులను బీజేపీకే కేటాయించడంపై పెద్ద చర్చ జరుగుతోంది. పీఈటీ నుంచి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి కేవంల రూ.77.3 కోట్లు మాత్రమే అందింది. ఇది బీజేపీకి అందిన విరాళంలో కేవలం 10 శాతం కూడా లేకపోవడం గమనార్హం. రెండు ప్రధాన జాతీయ పార్టీలతోపాటు తృణమూల్ కాంగ్రెస్, వైసీపీ, శివసేన, బీజేడీ, బీఆర్ఎస్, ఎల్జేపీ, జేడీయూ, డీఎంకే పార్టీలకు పీఈటీ నుంచి రూ.10 కోట్లు చొప్పున విరాళాలు అందాయి.

# శ్రీలంకను కుదిపేసిన దిత్వా తుఫాన్

**ఇప్పటి వరకూ 486 మంది మృత్యువాత**


**సుమారు 341 మంది ఆచూకీ గల్లంతు**



**కొలంబో,డిసెంబర్5:** దిత్వా తుఫాన్ ద్వీప దేశం శ్రీలంకను భారీగా కుదిపేసింది. తుఫాను బీభత్సానికి కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడికక్కడ వరదలు సంభవించాయి. ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక పట్టణాలు పూర్తిగా నీట మునిగాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. దిత్వా తుఫాను బీభత్సానికి భారీగా ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. నవంబర్ 16 నుంచి ఇప్పటి వరకూ 486 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 341 మంది ఆచూకీ గల్లంతయింది. ఈ సంక్షోభ సమయంలో భారత దేశం శ్రీలంకకు అండగా నిలుస్తోంది. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో మానవతా సాయాన్ని అందజేస్తోంది. జాతీయ విపత్తు స్పందన దళం , భారత వాయు సేన ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి.

# బాలకృష్ణ అభిమానులకు నిరాశ

## అఖండ-2 వాయిదా వేసిన నిర్మాణ సంస్థ



**హైదరాబాద్,డిసెంబర్5:** బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' వాయిదా పడింది. ఈ సినిమా విడుదలపై కొన్ని గంటలుగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సమస్యల్లో చిక్కుకున్నట్లు వార్తలొచ్చాయి. గురువారం రాత్రి ప్లాన్ చేసిన ప్రీమియర్స్‌ను చిత్ర బృందం రద్దు చేయడంతో.. ఆ వార్తలకు బలం చేకూరింది. తాజాగా చిత్ర విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 5న థియేటర్లలో ఈ చిత్రం విడుదల కావాల్సిఉంది. ఈ మేరకు 14 రీల్స్ ప్లస్ సంస్థ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. 'అనివార్య కారణాల వల్ల 'అఖండ 2' షెడ్యూల్ ప్రకారం విడుదల కావడం లేదు. ఈ విషయం పట్ల చింతిస్తున్నాం. ఈ క్షణం మాకు చాలా బాధాకరమైనది. ప్రతి అభిమాని, సినీ ప్రేమికుడికి ఇది కలిగించే నిరాశను మేము అర్థం చేసుకుంటాము. ఈ విషయాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాము. ఈ నిర్ణయం పట్ల కలిగిన అసౌకర్యానికి మా హృదయపూర్వక క్షమాపణలు.

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,డిసెంబర్5:** మగువలకు బంగారం ధరలు మళ్లీ షాకిచ్చాయి. నిన్న స్వల్పంగా తగ్గిన ధరలు.. శుక్రవారంమళ్లీ పెరిగిపోయాయి. రోజుకోలాగా బంగారం ధరలు హెచ్చు తగ్గులు అవుతున్నాయి. శుక్రవారం తులం గోల్డ్‌పై రూ.270 పెరగగా.. సిల్వర్ ధర మాత్రం దిగొచ్చింది. ఏకంగా రూ.4,000 తగ్గింది.బులియన్ మార్కెట్‌లో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.270 పెరిగి రూ.1,29, 930 దగ్గర ట్రేడ్ అవుతుండగా.. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.250 పెరిగి రూ.1,19,100 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.210 పెరిగి రూ.97, 450 దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధర మాత్రం ఈరోజు భారీ ఉపశమనం కలిగింది.

TGTEL/25/A4111
మంచితనం
జర్నలిస్ట్
MANCHITANAM JOURNALIST DAILY
దినపత్రిక
శనివారం,
డిసెంబర్ 06 2025





# వైజాగ్ గడ్డపై టీమిండియా రికార్డులివే



భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. 1-1తో సిరీస్ సమం కావడంతో, డిసెంబర్ 6, 2025న విశాఖపట్నంలోని డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరగనున్న చివరి మ్యాచ్ నిర్ణయాత్మకం కానుంది.విశాఖలో టీమిండియా రికార్డు. విశాఖపట్నం మైదానం భారత జట్టుకు ఎప్పుడూ కలిసొచ్చే వేదికగా నిలిచింది. ఇక్కడ టీమిండియా రికార్డులు చాలా బలంగా ఉన్నాయి.మొత్తం మ్యాచ్‌లు: ఇప్పటివరకు భారత్ ఈ మైదానంలో 10 వన్డే మ్యాచ్‌లు ఆడింది.ఓట ములు: కేవలం 2 మ్యాచ్‌లలో మాత్రమే ఓడిపోయింది.టై: ఒక మ్యాచ్ టైగా ముగిసింది.ఈ మైదానంలో భారత్ విజయాల శాతం 70% కంటే ఎక్కువగా ఉంది. అయితే, ఇక్కడ భారత్ చివరగా 2019లో వన్డే విజయా న్ని రుచిచూసింది. ఆ తర్వాత 2023లో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. ఇప్పుడు 6 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలని టీమిండియా పట్టుదలగా ఉంది.దక్షిణాఫ్రికా పరిస్థితి: మరోవైపు, దక్షిణాఫ్రికా జట్టుకు ఈ మైదానం పూర్తిగా కొత్త. ప్రోటీస్ జట్టు ఇప్పటివరకు ఈ వేదికపై ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడలేదు. గతంలో ఇక్కడ ఒక టెస్టు (2019), ఒక టి20 (2022) ఆడినా, రెండింటిలోనూ ఓటమిపాలైంది.దీంతో వైజాగ్ గడ్డపై దక్షిణాఫ్రికా రికార్డు శూన్యం. 10 ఏళ్ల తర్వాత భారత్‌లో వన్డే సిరీస్ గెలవాలన్న వారి కల నెరవేరాలంటే ఇక్కడ చరిత్ర సృష్టించాల్సి ఒదే.తుది జట్లు (అంచనా): భారత్: కె.ఎల్. రాహుల్ (కెప్టెన్/వికెట్ కీపర్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసీద్ధ్ కృష్ణ, రిషబ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురేల్, తిలక్ వర్మ, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్.దక్షిణాఫ్రికా: ఐడెన్ మార్క్రామ్, ర్యాన్ రికెల్టన్, టెంబా బావుమా (కెప్టెన్), క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్), మాథ్యూ బ్రీట్జ్కే, టోనీ డి జోర్జీ, డెవాల్డ్ బ్రెవిస్, మార్కో జాన్సన్, కార్బిన్ బాష్, ప్రెనెల్లన్ సుబ్రియన్, ఆండ్రీ బెర్గర్, ఒట్నీల్ బార్ట్‌మన్, కేశవ్ మహారాజ్, లుంగి న్గిడి, రూబిన్ హర్మాన్.సిరీస్ డిసైడర్ కావడంతో ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. సొంతగడ్డపై భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుందా లేదా దక్షిణాఫ్రికా చరిత్ర తిరగరాస్తుందా అనేది వేచి చూడాలి.

# ఎల్ఐసీ నుంచి దిమ్మతిరిగే రెండు కొత్త ప్లాన్స్





కేంద్ర ప్రభుత్వ బీమా సంస్థ అయిన లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాగురించి మనందరికీ తెలిసిందే. ఎప్పటినుంచో దేశ ప్రజల నోళ్లల్లో నానుతున్న ఈ సంస్థ.. ఎన్నో సేవింగ్స్ ప్లాన్‌ను తీసుకొస్తోంది. ప్రైవేట్ బీమా సంస్థలకు పోటీగా ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్లాన్లను ప్రవేశపెడుతోంది. ఇది కేంద్ర ప్రభుత్వ సంస్థ కాబట్టి.. ప్రజల్లో నమ్మకం ఎక్కువగా ఉండటం వల్ల ఎల్ఐసీలో పాలసీలు తీసుకునేవారు కోట్లల్లో ఉంటారు. మనం వివిధ పాలసీల ద్వారా ఇన్వెస్ట్ చేసే డబ్బులకు భద్రత ఉండటం, అధిక రాబడి కూడా వస్తుండటంతో ఎల్ఐసీలో పాలసీలు తీసుకునేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. తాజాగా ఎల్ఐసీ మరో రెండు ప్లాన్స్‌ను లాంచ్ చేసింది.ప్రొటెక్షన్ ప్లస్, బీమా కవచ్ పేరుతో ఎల్ఐసీ తాజాగా మరో రెండు ఇన్స్యూరెన్స్ ప్లాన్స్‌ను ప్రారంభించింది. ప్రొటెక్షన్ ప్లాస్ అనేది సేవింగ్స్ ప్లాన్ కేటగిరీలో ఉండగా.. బీమా కవచ్ అనేది రిస్క్ ప్రొటెక్షన్ ప్లాన్ కేటగిరీలో ఉంది. ఈ ప్లాన్ల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

ఎల్ఐసీ ప్రొటెక్షన్ ప్లస్
-18 నుంచి 65 ఏళ్ల వయస్సు వారు అర్హులు
-గరిష్టంగా ఎంతైనా పెట్టుబడి పట్టవచ్చు
-యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ రైడర్ సదుపాయం ఉంది
-పాలసీ తీసుకున్నవారికి మధ్యలో ఏమైనా అయితే బేసిక్ సమ్ అష్యూర్డ్ అమౌంట్‌తో పాటు బేస్ ప్రీమియం ఫండ్ వాల్యూ చెల్లిస్తారు. -మీరు ఎంచుకునే పాలసీ వ్యవధిని బట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది
-10,15,20,25 ఏళ్ల కాల వ్యవధి ఉంటుంది. ఇక 5,7,10,15 ఏళ్ల ప్రీమియం చెల్లింపు కాలాన్ని ఎంచుకోవచ్చు.
-పాలసీ తీసుకున్న ఐదేళ్ల తర్వాత మీరు పాక్షికంగా నగదును తీసుకునే అవకాశం ఉందిబీమా కవచ్ ప్లాన్ వివరాలు-18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులు-మినిమం రూ.2 లక్షలతో బీమా మొదలవుతుంది. గరిష్టంగా ఎంతైనా తీసుకోవచ్చు-ప్రీమియం ఒకేసారి లేదా 5,10,15 ఏళ్లు చెల్లించవచ్చు-కనిష్ట మెచ్యూరిటీ వయస్సు 28 ఏళు ్లగా ఉండగా గరిష్ట వయస్సు 100 ఏళ్లుగా ఉంది.-ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబానికి ఆర్థిక భద్రతగా ఈ ప్లాన్ ఉంటుంది

# మరో 16 శతకాల దూరంలో విరాట్



దక్షిణాఫ్రికాపై రెండు వన్డేలలో వరుసగా రెండు సెంచరీలు బాదిన విరాట్ కోహ్లీ మళ్లీ తన పూర్వపు రోజుల్ని గుర్తు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ స్టార్ బ్యాటర్‌కు సంబంధించి దేశ క్రికెట్‌లో పెద్ద చర్చ నడుస్తోంది. అది..విరాట్ శతకాల 'సెంచరీ' చేస్తాడా అని! 37 ఏళ్ల కోహ్లీ సఫారీలపై రెండు శతకాలను (135, 102) కూడా మంచి స్ట్రయిక్ రేట్‌తో సాధించాడు. ఇటీవలి కాలంలో అతడి స్ట్రయిక్ రేట్‌పై విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో..వాటిని తిప్పికొడుతూ వేగంగా పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికాపై రెండో వన్డేలో సెంచరీ..విరాట్ కెరీర్‌లో 84వది. తాజా ఫామ్ 2016-17లో కోహ్లీ అద్భుత ప్రదర్శన రోజులను జ్ఞప్తికి తెస్తోంది. దీంతో అన్ని ఫార్మాట్లలో కలిపి సచిన్ చేసిన వంద శతకాల రికార్డును అతడు చేరుకోవడం సాధ్యం కావచ్చేమోనన్న చర్చ జరుగుతోంది. వన్డే వరల్డ్ కప్ 2027 అక్టోబరు-నవంబరులో దక్షిణాఫ్రికాలో జరగనుంది. ఇదే ఫిట్‌నెసను కాపాడుకుంటూ, క్రమం తప్పకుండా జట్టుకు ఎంపికైతే కనుక మెగా టోర్నీకి ముందు కోహ్లీకి మరో 25 వన్డేలు ఆడే అవకాశం లభిస్తుంది.ఆ దిశగాఅడుగులువన్డే ప్రపంచ కప్ నాటికీ ఇదే ఫామ్‌ను కొనసాగించాలనే పట్టుదలతో విరాట్ ఉన్నాడు. దాంతో విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో ఆడాలని అతడు నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయాన్ని క్రికెట్ పండితులు స్వాగతిస్తున్నారు. బెంగళూరులో జరిగే మూడు మ్యాచ్‌ల్లో ఢిల్లీకి కోహ్లీ ఆడనున్నట్టు సమాచారం.ఆత్మవిశ్వాసం రెండింతలు.ఇటీవలి కాలంలో పెద్దగా ఫామ్‌లో లేని విరాట్‌కు..సఫారీలపై చేసిన రెండు సెంచరీలు అతడిలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేశాయి. కోహ్లీ గత రికార్డులను పరిశీలిస్తే ప్రతి 5-6 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లో ఒక శతకం సాధించాడు. కొన్ని సంవత్సరాల్లో అయితే ఆ రికార్డు మరింత మెరుగ్గా ఉండడం విశేషం. కానీ వయస్సు, కొన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లే ఆడడం వల్ల కొంతకాలంగా అతడి శతకాల నిష్పత్తి తగ్గింది. పైగా టెస్టులు, టీ20లనుంచి ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇక్కడి నుంచి..ప్రతి 4, కొట్టే రేట్‌ను కనుక విరాట్ కొనసాగిస్తే..12-16 శతకాలు సాధించేందుకు కనీసం 50-60 మ్యాచ్‌లు అవసరమవుతాయి..కానీ 2027 వన్డే వరల్డ్ కప్‌తో కలిపి కోహ్లీ కొంచెం అటూఇటూగా 36 మ్యాచ్‌లు మాత్రమే ఆడే చా న్సుంది. ఈ కోణంలో చూస్తే కోహ్లీ 2027 నాటికి వంద శతకాలు చేసే చాన్సులు దాదాపు కనిపించడం లేదు. అయితే పైన పేర్కొన్న మ్యాచ్‌ల కన్నా ఎక్కువ ఆడడంతోపాటు అత్యధిక సెంచరీల రేటు కలిగిన 2016-17 నాటి ఫామ్‌ను అందుకొంటే కోహ్లీ శతకాల 'సెంచరీ'కి చేరువ అయ్యే అవకాశాలు లేకపోలేదు. కానీ వన్డే వరల్డ్‌కప్ తర్వాత కోహ్లీ రిటైరవడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.


# 12ఏళ్ల నిరీక్షణకు తెర- ఆసీస్ గడ్డపై రూట్ సెంచరీ- యాషెస్ రెండో టెస్టు





2025 యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా- ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. ఇది డే/ నైట్ టెస్టు. బ్రిస్బేన్ లోని గబ్బా మైదానం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్?లో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 325- 9 స్కోర్?తో ఉంది. క్రీజులో జో రూట్ (135 పరుగులు), జోఫ్రా ఆర్చర్ (32 పరుగులు) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6 వికెట్లతో చెలరేగాడు. ఇక మిచెల్ నజీర్, స్కాట్ బొలాండ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. వాళ్లిద్దరే హైలైట్!తొలి ఇన్నింగ్స్‌లో ఇటు రూట్ బ్యాటింగ్, అటు ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ బౌలింగే హైలైట్. గబ్బా మైదానంలో పేస్‌తో స్టార్క్ బెంబేలెత్తించాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్లను ఔట్ చేసి పతనాన్ని శాసించాడు. అయితే స్టార్క్ బౌలింగ్?కు ఇంగ్లాండ్ బ్యాటర్లు ఒక్కొక్కరుగా దాసోహం అయిపోతే, జో రూట్ మాత్రం నిలబడ్డాడు. సూపర్ బ్యాటింగ్ స్కిల్స్?తో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే తన టెస్టు కెరీర్?లో తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి సెంచరీ సాధించాడు. రూట్ 181 బంతుల్లో 100 పరుగుల మార్క్ అందుకున్నాడు.12ఏళ్ల నిరీణక్షణకు తెరకాగా, ఆస్ట్రేలియా గడ్డపై రూట్? ఇప్పటిదాకా నాలుగు యాషెస్ సిరీస్?లు ఆడాడు. ఈ నాలుగింటిలో అతడు ఈ మ్యాచ్?కు ముందుదాకా ఆసీస్ గడ్డపై సెంచరీ చేయకపోవడం గమనార్హం. తాజా సెంచరీనే రూట్‌లో ఆస్ట్రేలియా గడ్డపై తొలి సెంచరీ. అక్కడ శతకం నమోదు చేసేందుకు రూట్ 30 ఇన్నింగ్స్?లు తీసుకున్నాడు. అలాగే రూట్? కెరీర్?లో ఇది 40వ టెస్టు సెంచరీ కావడం విశేషం.

# దేశ ప్రజలకు ఆర్బీఐ అదిరిపోయే గుడ్‌న్యూస్ ఈఎంఐలు కట్టేవారికి పండుగే






దేశ ప్రజలకు ఆర్బీఐ గుడ్‌న్యూస్ తెలిపింది. అందరూ ఊహించినట్లుగానే రెపో రేటును మరోసారి తగ్గించింది. ఇప్పటివరకు 5.5 శాతంగా ఉండగా.. శుక్రవారం దానిని 5.25 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. అంటే 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఇక స్టాడింగ్ డిపాజిట్ ఫెలిసిటీని రేటును 5 శాతానికి పరిమితం చేయగా.. మార్జినల్ స్టాడింగ్ ఫెలిసిటీ రేటును 5.5 శాతంగా కొనసాగించింది. ఈ సంవత్సరంలో రెపో రేటును తగ్గించడం ఇది నాలుగోసారి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 125 బేసిస్ పాయింట్లను తగ్గించింది. దీని వల్ల ఈఎంఐ చెల్లించేవారికి మరింతగా తగ్గనుంది. డిసెంబర్ 3 నుంచి ప్రారంభమైన ఆర్‌బీఐ మానిటరింగ్ కమిటీ సమావేశ ాలు నేటితో ముగిశాయి. ఈ మీటింగ్‌లో చర్చించిన అనంతరం రెపో రేటు తగ్గింపును ప్రకటించారు. రెపో రేటు తగ్గింపు తక్షణమే అమల్లో రానుందని ఆర్బీఐ వెల్లడించింది. ద్రవ్యోల్బణం తగ్గడం, జీడీపీ వృద్ధి కొనసాగుతున్న క్రమంలో ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థిక కార్యకలాపాలు మరింత మెరుగుపడటానికి ఆర్బీఐ తాజా డెసిషన్ ఉపయోగపడనుంది. రెపో రేటు తగ్గింపు వెనక కారణాన్ని ఆర్బీఐ తెలిపింది. ద్రవ్యోల్బణం అంచనా బాగా మెరుగుపడిందని, మునుపటి అంచనాల కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని గుర్తించామని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు.వచ్చే ఏడాది ప్రారంభంలో ద్రవ్యోల్బణం 4 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉంటాయని సంజయ్ మల్హోత్రా తెలిపారు . విలువైన లోహాల ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణంలో కొంత భాగం పెరుగుతోందని అంచనా వేశారు. ద్రవ్యోల్బణం అనేక సంవత్సరాల కనిష్ట స్థాయికి పడిపోయిందని, ఆర్థిక వృద్ధి ఆశ్చర్యకరంగా పెరగడంతో ఈ నిర్ణయం నిర్ణయం తీసుకున్నామన్నారు. ద్రవ్యోల్బణాన్ని లక్ష్యంలో ఉంచుతూ రుణ పరిస్థితులు మద్దతుగా ఉండేలా చూసుకోవడం తమ లక్ష్యమన్నారు.ఈఎంఐలు కట్టేవారికి లాభంరెపో రేటు ప్రభావం బ్యాంకుల నుంచి తీసుకునే లోన్లపై ప్రభావితం చూపుతుంది. రెపో రేటు తగ్గింపు వల్ల ఈఎంఐలపై చెల్లించే వడ్డీ అనేది తగ్గుతుంది. దీని వల్ల మీరు చెల్లించాల్సిన ఈఎంఐ తగ్గుతుంది. ఇక రెపో రేటును తగ్గించినప్పుడు బ్యాంకులు కూడా వివిధ రుణాలపై వడ్డీ రేటును తగ్గించాల్సి ఉంటుది. దీని వల్ల కొత్తగా లోన్ తీసుకునేవారికి కూడా వడ్డీ రేట్లు తగ్గుతాయి. ఏ విధంగా చూసుకున్న ఇది ప్రజలకు శుభవార్తగా చెప్పవచ్చు

# రూ.కోటి సంపాదించాలని అనుకుంటున్నాం







డబ్బు సంపాదించాలనే కల, కోరిక ఎవరికుండదు చెప్పండి. కానీ, సరైన సమయంలో సరైన మార్గంలో పెట్టుబడి పెడితే.. ఆ తర్వాత డబ్బే డబ్బుని సంపాదిస్తుంది. ప్రస్తుత కాలంలో మంచి రాబడి ఇ?చ్చే పెట్టుబడి పథకం గురించి మాట్లాడుకుంటే.. మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం ఉత్తమ మార్గం. ముఖ్యంగా %ూఔ% (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) దీనిని ఆర్థిక నిపుణులు దీర్ఘకాలికంగా పెద్ద మూలధనాన్ని నిర్మించడానికి ఉత్తమ మార్గంగా భావిస్తారు. %ూఔ% ప్రత్యేకత ఏమిటంటే మీరు ప్రతి నెలా ఒక స్థిర మొత్తాన్ని పెట్టుబడి పెడతారు, ఇది రూపాయి ఖర్చు సగటు నుండి ప్రయోజనం పొందుతుంది. దీర్ఘకాలిక రాబడిని మెరుగుపరుస్తుంది.ఇప్పుడు మీ లక్ష్యం రాబోయే 10 సంవత్సరాలలో రూ.1 కోటి మూలధనాన్ని నిర్మించడం అయితే, మీరు నెలవారీ %ూఔ%లో ఎంత పెట్టుబడి పెట్టాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ మొత్తం మీ మ్యూచువల్ ఫండ్ వార్షిక రాబడిపై ఆధారపడి ఉంటుంది. రాబడి ఎంత ఎక్కువగా ఉంటే, నెలవారీ %ూఔ% మొత్తం అంత తక్కువగా ఉంటుంది.మీ పెట్టుబడి 9 శాతం, 13 శాతం మధ్య వార్షిక రాబడిని ఇస్తే, %ూఔ% మొత్తం మారుతుంది. 9 శాతం రాబడితో మీరు నెలకు సుమారు రూ.51,676 పెట్టుబడి పెట్టాలి, ఫలితంగా 10 సంవత్సరాలలో సుమారు రూ.62 లక్షల మొత్తం పెట్టుబడి పెట్టవచ్చు, మీ లక్ష్యాన్ని సాధించవచ్చు. 10 శాతం రాబడితో నెలవారీ %ూఔ% ద్వారా రూ.48,817తో అదే లక్ష్యాన్ని సాధించవచ్చు. ఫలితంగా మొత్తం రూ.58.58 లక్షల పెట్టుబడి వస్తుంది.మీ మ్యూచువల్ ఫండ్స్ 11 శాతం వార్షిక రాబడిని ఇస్తే, మీ %ూఔ% మొత్తం రూ.46,083కి తగ్గుతుంది. ఫలితంగా 10 సంవత్సరాలలో మొత్తం రూ.55.30 లక్షల పెట్టుబడి వస్తుంది. అదేవిధంగా 12 శాతం రాబడితో మీరు నెలకు రూ.43,471 పెట్టుబడి పెట్టాలి, ఫలితంగా మొత్తం రూ.52.17 లక్షల పెట్టుబడి వస్తుంది. ఉత్తమ సందర్భంలో మీరు 13 శాతం రాబడిని సంపాదిస్తే, మీరు కేవలం రూ.42,320 నెలవారీ %ూఔ%తో 10 సంవత్సరాలలో రూ.కోటి కార్పస్‌ను నిర్మించుకోవచ్చు.

మంచితనం
జర్నలిస్ట్ MANCHITANAM JOURNALIST DAILY దినపత్రిక
TGTEL/25/A4111

# లక్కీ హీరోయిన్



ప్రస్తుతం ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు మీనాక్షి చౌదరి. ఈ అమ్మడు ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. వరుస సినిమాలతో యమా బిజీ అయ్యింది ఈ వయ్యారి భామ మొన్నటి వరకు మీనాక్షికి చెప్పుకోదగ్గ ఆఫర్స్ రాలేదు. కానీ ఇప్పుడు క్యూ కడుతున్నాయి.ప్రస్తుతం ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు మీనాక్షి చౌదరి. ఈ అమ్మడు ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. వరుస సినిమాలతో యమా బిజీ అయ్యింది ఈ వయ్యారి భామ మొన్నటి వరకు మీనాక్షికి చెప్పుకోదగ్గ ఆఫర్స్ రాలేదు. కానీ ఇప్పుడు క్యూ కడుతున్నాయి. అందంతో పాటు నటనతోనూ అదరగొడుతుంది ఈ చిన్నది.ప్రస్తుతం ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు మీనాక్షి చౌదరి. ఈ అమ్మడు ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. వరుస సినిమాలతో యమా బిజీ అయ్యింది ఈ వయ్యారి భామ మొన్నటి వరకు మీనాక్షికి చెప్పుకోదగ్గ ఆఫర్స్ రాలేదు. కానీ ఇప్పుడు క్యూ కడుతున్నాయి. అందంతో పాటు నటనతోనూ అదరగొడుతుంది ఈ చిన్నది.ఇచట వాహనములు నిలుపరాదు అనేసినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది మీనాక్షి. సుశాంత్ హీరోగా నటించిన ఈ సినిమా అంతగా ఆడలేదు. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో తన గ్లామర్ తో కట్టిపడేసింది. అడవి శేష్ నటించిన హిట్ 2 మీనాక్షికి మంచి గుర్తింపు తెచ్చింది.ఇచట వాహనములు నిలుపరాదు అనేసినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది మీనాక్షి. సుశాంత్ హీరోగా నటించిన ఈ సినిమా అంతగా ఆడలేదు. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో తన గ్లామర్ తో కట్టిపడేసింది. అడవి శేష్ నటించిన హిట్ 2 మీనాక్షికి మంచి గుర్తింపు తెచ్చింది.ఇక ఇప్పుడు ఈ చిన్నది సెన్సేషన్ గా మారిపోయింది. యంగ్ హీరోల దగ్గర నుంచి స్టార్ హీరోల సినిమాల వరకు అన్ని ఆఫర్స్ అందుకుంటుంది. అలాగే ఒకటి రెండు పాన్ ఇండియా సినిమాలు కూడా ఉన్నాయని టాక్. ఇదిలా ఉంటే మీనాక్షి రీసెంట్ గా తన క్రష్ ఎవరో చెప్పేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మీనాక్షి మాట్లాడుతూ.. స్కూల్ టైం లో నాకు ఓ క్రష్ ఉండేది. మా స్కూల్ టీచర్ అంటే నాకు క్రష్ ఉండేది. నా ఒక్కదానికే కాదు మా స్కూల్ లో ఉండే అమ్మాయిలందరికి ఆతని పై క్రష్ ఉండేది.ఇక ఇప్పుడు ఈ అమ్మడు లిస్ట్ లో బడా సినిమాలు చాలానే ఉన్నాయి. అలాగే ఒకటి రెండు పాన్ ఇండియా సినిమాలు కూడా ఉన్నాయని టాక్. ఇదిలా ఉంటే మీనాక్షి రీసెంట్ గా తన క్రష్ ఎవరో చెప్పేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మీనాక్షి మాట్లాడుతూ.. స్కూల్ టైం లో నాకు ఓ క్రష్ ఉండేది. మా స్కూల్ టీచర్ అంటే నాకు క్రష్ ఉండేది. నా ఒక్కదానికే కాదు మా స్కూల్ లో ఉండే అమ్మాయిలందరికి ఆతని పై క్రష్ ఉండేది.అతనే నా ఫస్ట్ క్రష్ ఆ తర్వాత కలగలేదు అని చెప్పుకొచ్చింది. అలాగే జీవితంలోఅందరికి ఎవరో ఒకరి మీద క్రష్ కలుగుతుంది. మా సంక్రాంతికి వస్తున్నాం సినిమా కూడా అదే కథతో తెరకెక్కింది. ఈ సినిమా మంచి విజయం సాధించడం సంతోషంగా ఉంది అంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి.అతనే నా ఫస్ట్ క్రష్ ఆ తర్వాత ఎవరిపై ఆ ఫీలింగ్ కలగలేదు అని చెప్పుకొచ్చింది. అలాగే జీవితంలోఅందరికి ఎవరో ఒకరి మీద క్రష్ కలుగుతుంది. మా సంక్రాంతికి

# అఖండ 2 వాయిదాకి మహేష్ బాబు సినిమాలే కారణమా




బోయపాటి శ్రీను-నందమూరి బాలకృష్ణ కాంబినేషన్‌లో తెరకెక్కిన పాన్-ఇండియా చిత్రం 'అఖండ 2' విడుదలకు కొన్ని గంటల ముందే ప్రీమి యర్ షోలు, టికెట్ బుకింగ్స్ ఆకస్మికంగా రద్దు కావడంతో అభిమానుల్లో తీవ్ర నిరాశ పెరిగింది. టీజర్, ట్రైలర్ నుంచే భారీ అంచనాలు పెంచుకున్న బాలయ్య అభిమానులు సోషల్‌మీడియాలో నిర్మాతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. " లాస్ట్ మినిట్ క్యాన్సిలేషన్ ఎలా చేస్తారు?", "ఇది ప్లానింగ్ లోపం కాదా?" అంటూ విమర్శిస్తున్నారు. టెక్నికల్ ఇష్యూస్ అంటూ విడుదల వాయిదాపై మేకర్స్ ఇచ్చిన వివరణను చాలా మంది నమ్మడం లేదు.ఇండస్ట్రీలో వినిపిస్తున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం 'అఖండ 2' ఆగిపోవడానికి ప్రధాన కారణం పాత ఆర్థిక వివాదాలే. సుకుమార్ దర్శకత్వంలో మహేశ్ బాబు నటించిన '1 నేనొక్కడినే', అనంతరం వచ్చిన 'ఆగడు' చిత్రాలకు ఏరోస్ ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూషన్, ఫైనాన్స్ అందించిన సంగతి తెలిసిందే.ఈ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ నష్టాలు చవిచూశాయి.దీంతో ఏరోస్ సంస్థకు 14 రీల్స్ సుమారు ?27%-%28 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వడ్డీలు కూడా భారీగా చేరడంతో మొత్తం బకాయిలు మరింత పెరిగినట్టు తెలుస్తోంది. ఈ బకాయిలను తీర్చకుండా 14 రీల్స్ సంస్థ '14 %=వవశ్రీం ాశ్రీబం%' అనే కొత్త పేరిట సినిమాలు చేస్తోందని ఆరోపిస్తూ ఏరోస్ లీగల్‌గా కోర్టుకు వెళ్లింది.ఈ కేసు నేపథ్యంలో మద్రాస్ హైకోర్టు అఖండ 2 విడుదలపై తాత్కాలిక స్టే విధించింది. అంటే అసలు సమస్య టెక్నికల్ కాదు,పాత బకాయిలు, లీగల్ కేసులే సినిమా రిలీజ్‌ను అడ్డుకున్నాయి. తీవ్రమైన ఫైనాన్షియల్ వివాదంపై 14 ఎలాంటి అధికారిక ప్రకటన ఇవ్వకపోవడం ఫ్యాన్స్‌ను ఇంకా అసహనానికి గురిచేస్తోంది.చివరి నిమిషంలో ఇలా భారీ ప్రాజెక్ట్ ఆగిపోవడం బాలయ్య అభిమానులకే కాదు, మొత్తం ఇండస్ట్రీకే షాక్‌గా మారింది. ఇప్పుడు అందరి చూపు కోర్టుపైనే ఉంది. పెండింగ్ సెటిల్మెంట్లు పూర్తయితే స్టే ఎత్తివేయబడే అవకాశం ఉంది. తరువాతే మేకర్స్ కొత్త విడుదల తేదీ ప్రకటించగలరు. 'అఖండ 2' విడుదల వాయిదా వెనుక ఉన్న అసలు నేపథ్యం బయటపడడంతో సినిమాపై ఉన్న గందరగోళం కొత్త మలుపు తిరిగింది. సమస్యలు త్వరగా పరిష్కారమై బాలయ్య మాస్ విజృంభణను చూడాలని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు

# ఈ ఏడాది 4 బ్లాక్‌బస్టర్లతో రెచ్చిపోయిన స్టార్ హీరో!



నేటి సినిమా ప్రపంచంలో, ఒక స్టార్ హీరో ఒక సినిమాను పూర్తి చేయడానికి కనీసం రెండేళ్ల సమయం తీసుకుంటున్నారు. బడ్జెట్ పెరగడం, షూటింగ్ ప్లానింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ కోసం ఎక్కువ సమయం కేటాయించడం వంటి కారణాల వల్ల ప్రేక్షకులకు ఇష్టమైన హీరోను తెరపై చూడాలంటే రెండు నుంచి మూడేళ్లు ఎదురుచూడక తప్పడం లేదు.అలాంటి ట్రెండ్ నడుస్తున్న సమయంలోనూ, ఒకే సంవత్సరంలో ఏకంగా నాలుగు సినిమాలను విడుదల చేసి, అన్నిటినీ విజయపథంలో నడిపించిన ఒక అరుదైన హీరో ఉన్నాడంటే నమ్ముతారా? ఇది కేవలం నటనతో సాధించిన రికార్డు కాదు, దర్శకత్వ ప్రతిభతో కలిపి సాధించిన చారిత్రక ఘనత. ప్రతి ప్రాజెక్టులోనూ వైవిధ్యం చూపించి, ప్రేక్షకులను కొత్తగా అలరించే సత్తా ఉన్న ఆ హీరో ఎవరు?ఆ అరుదైన రికార్డును సొంతం చేసుకున్న హీరో మరెవరో కాదు, తమ ప్రత్యేకమైన కథా ఎంపిక, సహజ నటనతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కోలీవుడ్? స్టార్? హీరో ధనుష్! ఈ సక్సెస్?ఫుల్? మల్టీటాలెంటెడ్? హీరో స్క్రిప్ట్ సెలెక్షన్ ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఈ ఒక్క సంవత్సరంలో ఆయన సాధించిన విజయం సినీ పరిశ్రమలోనే ఒక హాట్‌టాపిక్‌గా మారింది. ఆయన కేవలం నటుడిగానే కాకుండా, దర్శకుడిగా కూడా తన ప్రతిభను నిరూపించుకున్నారు.ఈ సంవత్సరంలో మొట్టమొదటగా ఫిబ్రవరిలో విడుదలైన 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే సినిమాకి ధనుష్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత, హీరోగా ధనుష్? నటించిన భారీ సినిమా 'కుబేర' విడుదలైంది. శేఖర్? కమ్ముల దర్శకత్వంలో ధనుష్?, రష్మిక మందన్నా జంటగా నటించిన ఈ సినిమా బాక్సాఫీస్? వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. టాలీవుడ్? స్టార్? హీరో నాగార్జున కూడా ఈ సినిమాలో కీలకపాత్రలో కనిపించారు.వీటితో పాటు ధనుష్? స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'ఇడ్లీ కడై', తాజాగా విడుదలైన 'తేరే ఇష్క్? మైన్' వంటి సినిమాలు కూడా ప్రేక్షకులను అలరించాయి. ధనుష్ ఒకే సంవత్సరంలో మూడు సినిమాలలో హీరోగా నటించడంతో పాటు, ఒక సినిమాని డైరెక్ట్ చేసి, మొత్తంగా నాలుగు ప్రాజెక్టులను అందించారు. నాలుగు సినిమాలూ విజయాలను అందుకోవడంతో, ప్రస్తుతం ధనుష్ గారు తిరుగులేని ఫామ్‌లో ఉన్నారని చెప్పవచ్చు. తన నటన, దర్శకత్వం ద్వారా ప్రేక్షకులను అంచలంచెలుగా అలరిస్తూ, తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు.

# కమిట్‌మెంట్ ఇస్తేనే బిగ్‌బాస్‌లోకి తీసుకుంటారా




నటి హిమజ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సినీ పరిశ్రమలోని పలు అంశాలపై తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. బిగ్ బాస్ షో తర్వాత సినీ పరిశ్రమలో అవకాశాలు తగ్గుతాయన్న అపోహలపై ఆమె స్పష్టతనిచ్చారు. బిగ్ బాస్ వల్ల తనకు ఎన్నో ఆఫర్లు వచ్చాయని, ఆర్థికంగా కూడా మంచిగా లాభపడ్డానని హిమజ తెలిపారు. బిగ్ బాస్ తర్వాత అనేక బ్రాండ్లు, షాపుల ప్రారంభోత్సవాలు, ఇతర ఈవెంట్‌ల కోసం తనను సంప్రదించారని, పెద్ద మొత్తంలో పారితోషికం ఆఫర్ చేశాయని ఆమె వెల్లడించారు. తన ప్రస్తుత క్రేజ్‌కు బిగ్ బాసే కారణమని హిమజ గట్టిగా చెప్పారు. అయితే, బిగ్ బాస్ షో తన కెరీర్‌కు నేరుగా ఎలా సహాయపడిందనే విషయంలో ఆమె ఒక ముఖ్యమైన తేడాను వివరించారు. తనలోని నటన ప్రతిభను, విభిన్న పాత్రలను పోషించే సామర్థ్యాన్ని బిగ్ బాస్ వేదికపై తాను ప్రదర్శించలేదని ఆమె పేర్కొన్నారు. "అసలు హిమజ ఏంటని చూపించాను కానీ నా టాలెంట్స్ ఏంటి, నేను ఇలా యాక్ట్ చేయగలను, అలా యాక్ట్ చేయగలను అన్న టాలెంట్స్ నేనేం చూపించలేదు షోలో" అని ఆమె అన్నారు. కాబట్టి, మూవీ ఆఫర్ల విషయానికి వస్తే బిగ్ బాస్ నేరుగా తన కెరీర్‌కు లింక్ అవ్వదని స్పష్టం కమిట్‌మెంట్‌ల గురించి తరచుగా వినిపించే ఆరోపణలను హిమజ తీవ్రంగా ఖండించారు. బిగ్ బాస్ వంటి షోలలో కమిట్‌మెంట్‌లు ఎక్కువగా ఉంటాయా అనే ప్రశ్నకు ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, ఈ మధ్య కమిట్‌మెంట్ అనే పదానికి ఎన్ని అర్థాలు ఉన్నాయో అర్థం కావట్లేదని అన్నారు. బిగ్ బాస్‌కు ఎంపికయ్యే వ్యక్తులు ఓపెన్ మైండెడ్, స్పోర్టివ్, ముక్కుసూటిగా మాట్లాడే స్వభావం ఉన్నవారై ఉంటారని ఆమె వివరించారు. అలాంటి వారితో అసభ్యకరమైన ప్రవర్తనకు ఎవరూ సాహసించరని హిమజ అన్నారు. తనతో పాటు తన స్నేహితులకు మూడు దశల్లో ఇంటర్వ్యూలు జరిగాయని, ఎప్పుడూ అలాంటి ఇబ్బంది ఎదురవలేదని ఆమె స్పష్టంగా చెప్పారు. కొన్ని పర్సనల్ నెగిటివ్ ఎక్స్‌పీరియన్స్‌ల వల్ల కొందరు అలాంటి ప్రచారాన్ని చేస్తుండవచ్చని, కానీ అది అందరికీ వర్తించదని ఆమె తేల్చి చెప్పారు. ఆఫర్లు రావడానికి కమిట్‌మెంట్‌లు కారణమనే పరిశ్రమలోని మరొక ప్రచారాన్ని హిమజ ప్రశ్నించారు. "కమిట్‌మెంట్‌లు ఇవ్వడం వల్ల ఆఫర్ వచ్చింది. మరి ఆఫర్ రానప్పుడు ఏంటి పాపం, కమిట్‌మెంట్‌లు ఇవ్వట్లేదా? అయ్యో పాపం. ఆ లాజిక్ ఏంటి అసలు?" అని ఆమె వ్యంగ్యంగా అన్నారు. కమిట్‌మెంట్లు ఇచ్చేవారు చాలా బాగా సినిమాలు చేసి సెటిల్ అయి ఉండాలని, కానీ వారు ఎక్కడా కనిపించట్లేదని హిమజ పేర్కొన్నారు. ఈ రకమైన మాటలు విన్నప్పుడు తనకు చాలా కోపం వస్తుందని ఆమె చెప్పారు. నటీనటులు తమ ప్రతిభను చూపించుకోవడానికి అవకాశం లభించడం అత్యంత ముఖ్యమని, కేవలం అవకాశం వస్తేనే వారు తమ టాలెంట్‌ను నిరూపించుకోగలరని ఆమె నొక్కి చెప్పారు.

# లేడీ సింగం అదరగొట్టింది



బిగ్ బాస్ సీజన్ 9 చివరి దశకు వచ్చేసింది. మొదటి ఫైనలిస్ట్ అయ్యేందుకు బిగ్ బాస్ టాస్క్ లు ఇస్తున్నారు. ఈ క్రమంలో ఒకొక్కరు అవుట్ అయ్యి.. రేస్ నుంచి తప్పుకుంటుంటున్నారు. కాగా ఇప్పటికే కొందరు ఈ రేస్ నుంచి తప్పుకున్నారు. కాగా ఎవ్వరూ ఊహించని విధంగా రీతూ చౌదరి టాస్క్ ల్లో ఇరగదీస్తోంది. రీతూ ఏకంగా కళ్యాణ్-ఇమ్మానుయేల్‌ని ఓడించింది. ఇప్పుడు ఒక్క అడుగు దూరంలో ఉంది ఈ అమ్మడు. తాజాగా వదిలిన ప్రోమోలో రీతూ చౌదరి భరణితో పోటీపడింది. ఇప్పటికే రేసు నుంచి సంజన, తనూజ, డీమాన్, సుమన్ అవుట్ అయ్యారు. మరోవైపు ఇమ్మానుయేల్, కళ్యాణ్, రీతూ చౌదరి, భరణి మాత్రమే రేసులో ఉన్నారు. తాజాగా వదిలిన ప్రోమోలో రీతూ, భరణి పోటీపడ్డారు.ఈ ఇద్దరికీ రింగ్ మాస్టర్ అనే టాస్క్ ఇచ్చాడు బిగ్ బాస్.. గార్డెన్ ఏరియాలో ఓ చెత్త కుప్ప ఏర్పాటు చేసి. దాంట్లో దాగి ఉన్న మూడు ట్రయాంగిల్స్, మూడు స్క్వేర్స్, మూడు సర్కిల్స్‌ని ఒకదాని తర్వాత ఒకటి సెట్ చేయాలి అని చెప్పాడు. అలాగే ఒక లైన్ పూర్తయిన తర్వాత ప్లేయర్లు ఒక రింగ్ తీసుకొని పోల్‌కి హ్యాంగ్ అయ్యేలా విసరాలి.. ఎవరైతే ముందుగా ఈ టాస్క్ పూర్తి చేస్తారో వారే విన్ అయ్యినట్టు చెప్పాడు. దాంతో రీతూ భరణి పోటాపోటీగా టాస్క్ ఆడారు.రీతూకి డిమాన్ పవన్, ఇమ్మాన్యుయేల్ సపోర్ట్ చేశారు. అలాగే భరణికి తనూజ సపోర్ట్ చేసింది. జాగ్రత్త నాన్న అంటూ సపోర్ట్ చేసింది. అయితే ఈ టాస్క్ లో రీతూ విన్ అయినట్టు తెలుస్తుంది. రీతూ సరిగ్గా పెట్టలేదు అని భరణి సంచలక్ గా ఉన్న సంజనతో వాదించడం చూపించారు. టాస్క్ అయిపోయిన తర్వాత రీతూ పెట్టింది ఒకటి ట్రయాంగిల్ కాదు అంటూ తనూజ మొదలు పెట్టింది. దాంతో భరణి కూడా అది ట్రైయాంగిల్ కాదు అని సంజనతో వాదించాడు. మరి ఏం జరిగిందో నేటి ఎపిసోడ్ లో చూడాలి.

# అమ్మాయిలు కచ్చితంగా చూడాల్సిన మూవీ




నేషనల్ క్రష్ రష్మిక మందన్నాఇప్పుడు ఇండియాలోనే ది మోస్ట్ వాంటెడ్ హీరోయిన్. ప్రస్తుతం ఆమె స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తూనే మరోవైపు లేడీ ఓరియంటెడ్ మూవీస్ తోనూ మెప్పిస్తోంది. అలా రష్మిక నటించిన లేడీ ఓరియంటెడ్ మూవీ' ది గర్ల్ ఫ్రెండ్'. అందాల రాక్షసి సినిమాతో హీరోగా మెప్పించి, చి ల సౌ సినిమాతో జాతీయ అవార్డు అందుకున్న డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ ఈ ప్రేమకథా చిత్రాన్ని తెరకెక్కించాడు. రష్మిక సరసన దసరా ఫేమ్ దీక్షిత్ శెట్టి నటించాడు. నవంబర్ 07న థియేటర్లలో విడుదలైన ది గర్ల్ ఫ్రెండ్ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు రాబట్టింది. చాలా తక్కువ బడ్జెట్ తో తెరకెక్కి న ఈ సినిమా రూ. 28 కోట్లకు పైగానే ఈ సినిమాలో చక్కగా చూపించారు డైరెక్టర్ రాహుల్ గా వారి కోరిక నెరవేరింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలో శుక్రవారం (డిసెంబర్ 05) అర్ధరాత్రి నుంచే ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ కు తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ మూవీతెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోనూ స్ట్రీమింగ్ అవుతోంది.

**Printed by Published by Derangula Rani on behalf of Derangula Rani, printed at and published at 45-238/3, Srinivas Nagar, Jagathgirigutta, Qutubullapur editor Derangula Rani.VASISTA PRINTERS18-97, #306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, RANGAREDDY, TELANGANA - 500060** TGTEL/25/A4111